# జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

## సిపి డాక్టర్ అనురాధ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

జాతీయ మెగా లోక్ అదాలత్ ఈనెల 8న నిర్వహించడం జరుగుతుందని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సీపీ డాక్టర్ అనురాధ కోరారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ రాజీమార్గమే రాజమార్గమని సమయాన్ని డబ్బులను ఆదా చేసుకోవాలన్నారు. కక్ష కారుణ్యాలతో ఏమి సాధించలేమని రాజీ పడితే ఇద్దరూ గెలిచినట్లేనని తెలిపారు. లోక్ఆదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుందన్నారు. క్రిమినల్ కంపౌండబుల్, తగాదా, ఆస్తి విభజన, కుటుంబపరమైన నిర్వాహణ, రోడ్డు ప్రమాదాలు, చిన్న చిన్న దొంగతనాలు, వైవాహిక జీవితానికి సంబందించిన కేసులతో పాటు బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ కేసులలో కక్షి దారులు రాజీపడాలన్నారు. కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృదా చేసుకోవద్దన్నారు.




# సమస్యలు పరిష్కరించాలి మంత్రి పొన్నంకు వినతి

**చిన్నకోడూరు, మార్చి 4, ప్రభాతవార్త :** మండలంలోని పలు సమస్యలను రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లినట్లు కాంగ్రెస్ నాయకులు అజ్జు యాదవ్ మంగళవారం తెలిపారు. మంత్రి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలను మంత్రికి వివరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించి సమస్యలను పరిస్కరించ డానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.


పొన్నంకు మండల సమస్యలను వివరిస్తున్న దృశ్యం


హరియణ గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్, సిపి

## హర్యాన గవర్నర్‌కు ఘన స్వాగతం

**కొమురవెల్లి, మార్చి 4,ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని శ్రీకొమురవెల్లి మల్లికార్జునస్వామిని దర్శించుకోవడానికి కుటుంబ సమేతంగా విచ్చేసిన హరియణ గవర్నర్ బండారు దత్తాత్రేయకు మంగళవారం సిద్దిపేట జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి, సీపీ డాక్టర్ అనురాధతో పాటు ఆలయ ఆధికారులు ఘన స్వాగతం పలికారు. కలెక్టర్, సీపీ, గజ్వేల్ ఆర్డీఓలు పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. ప్రభుత్వ లాంచనాల ప్రకారం పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఆయన స్వామివారిని దర్శించుకొని, పట్నాలువేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం జగదేవపూర్ మండల పరిధిలోని కొండపోచమ్మ ఆలయాన్నికి వెళ్లారు. ఈ సందర్భంగా కుర్మలు గవర్నర్‌ను ఘనంగా సత్కారించారు. ఆయనవెంట మెదక్ ఎంపి రఘునందన్‌రావు ఉన్నారు.

### నీట్ పరీక్ష కేంద్రం ఎంపికకు

## కళాశాలను పరిశీలించిన కలెక్టర్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**


నీట్ పరీక్ష కేంద్రాల కోసం కళాశాలను పరిశీలిస్తున్న కలెక్టర్, సీపీ

నీట్ యూజీ ఎగ్జామినేషన్ 2025 ఎంట్రన్స్ పరీక్ష మే 4న జిల్లాలో మూడు సెంటర్లలో నీట్ ఎంట్రన్స్ పరీక్షను నిర్వహించడానికి మంగళవారం జిల్లాస్థాయి కో–ఆర్డినేషన్ కమిటీ చైర్‌పర్సన్, జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి సీపీ డాక్టర్ అనురాధతో కలిసి జిల్లా కేంద్రంలో పలు విద్యాసంస్థలను పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని ప్రతిభ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ డిగ్రీకళాశాల, సిద్దార్థ హైస్కూల్, పొన్నాల శివారులోని ఇందూరు కళాశాల, వికాస్ హైస్కూల్‌లను క్షేత్రస్థాయిలో నేషనల్ టెస్టింగ్ కమిటీ ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం నీట్ పరీక్షకు కావాల్సిన సౌకర్యాలు, సదుపాయాలు పరిశీలించారు. సెంటర్‌లో విద్యుత్ సౌకర్యం, సీసీ కెమెరాల ఏర్పాటు, ఫర్నిచర్, పార్కింగ్ సౌకర్యం దివ్యంగా విద్యార్థుల కోసం ర్యాంపు ఇలా అన్ని సౌకర్యాలతో కూడిన సెంటర్లను మాత్రమే ఎంపిక చేయడం జరుగుతుందని వారు తెలిపారు. పరిశీలించిన అన్ని విద్యా సంస్థలలో డిస్టిక్ లెవెల్ కో-ఆర్డినేషన్ కమిటీ మూడు సెంటర్లను ఎంపిక చేసి ఆ నివేదికను పై అధికారులకు పంపిస్తామని వారు తెలిపారు. వారి వెంట ఎఆర్ అడిషనల్ డీసీపీ అడ్మిన్ సుభాష్‌చంద్రబోస్, డిఈఓ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

## పరవళ్లు తొక్కిన గోదావరి జలాలు

### ప్రత్యేక పూజలు చేసిన రంగాయయిపల్లి గ్రామస్థులు

**చిన్నకోడూరు, మార్చి 4, ప్రభాతవార్త :** గోదావరి జలాలు మండల పరిధిలోని రంగాయయిపల్లి, విఠలాపూర్ గ్రామాల్లోని చెరువు, కుంటలకు మంగళవారం పరవళ్లు తొక్కడంతో రైతులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి నెలలో రైతుల పంట పొలాలకు గోదావరి జలాలు అందించడానికి కృషిచేసిన మాజీ మంత్రి,ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావులు చేపట్టిన ప్రాజెక్టుల నిర్మాణంలో భాగంగానే ఎండ కాలంలో సైతం గోదావరి జలాలు పరవళ్లు తొక్కడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మద్దికుంట నవీన్, మాజీ ఎంపిటిసి సింగిరెడ్డి సునితసాగర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సిద్దుల శ్రీనివాస్, రైతులు శ్రీనివాస్‌రెడ్డి, నారాయణరెడ్డి, రాజయ్య, రాములు, శివ, మహిళ రైతులు, బిఆర్ఎస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## 8న అన్ని న్యాయస్థానాలలో లోక్ అదాలత్

### -సీనియర్ సివిల్ జడ్జి జితేందర్

**సంగారెడ్డి బ్యూరో, మార్చి 4 ప్రభాతవార్త:**

జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 8వ తేదీన మెదక్ జిల్లాలోని అన్ని న్యాయ స్థానాలలో లోక్అదాలత్ నిర్వహించడం జరుగుతుందని సీనియర్ సివిల్ జడ్జి జితేందర్ తెలిపారు. మంగళవారం మెదక్ కోర్టు నుండి జితేందర్ ఈ నెల 8న జరగే లోక్ అదాలత్‌పై ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీమార్గమే రాచమార్గము అనే సదుద్దేశంతో కక్షిదారులకు త్వరిత, సమ్మతమైన న్యాయం సులువుగా అందుబాటులో ఉండాలని దేశవ్యాప్తంగా ఈ నెల 8న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడుతుందని, జిల్లా న్యాయసేవా ధికార సంస్థ చైర్ పర్సన్ గారి ఆదేశాల మేరకు కక్షిదారుల సౌకర్యార్థం ఈ నెల 1వ తేది నుంచే లోక్ అదాలత్ బెంచీలను ఆయా న్యాయస్థానాల లోనే ఏర్పాటు చేశామని చెప్పారు. వివాహ సం బంధ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, భూమి తగా దాలు, డబ్బు తగాదాలు, ప్రమాదాల పరిహారం కేసులు, చిన్న చిన్న క్రిమినల్ కేసులు ఇలా వివిధ రకాల కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ ఒక సుహృద్భావ మార్గం అని అన్నారు. అంతేకాకుండా కోర్టులో కేసు వేసే అర్హత కలిగిన సమస్య ఏదైనా కేసు వేయకుండా ప్రిలిటిగేషన్ సెటిల్మెంట్ ద్వారా ఈ లోక్అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చు అని తెలి పారు. క్షణిక ఆవేశాలకు పోయి పగలు, పంతాలు పెంచుకొని కేసుల్లో ఇరికితే పోలీస్‌స్టేషన్లు, కోర్టులకు ఎక్కితే నష్టమే తప్ప లాభం ఉండదని, విలువైన సమయం, మనశాంతి, డబ్బు కోల్పోవాల్సి వస్తుందని అన్నారు. పేదరికరంతో ఉన్నటువంటి వారు, న్యాయ సహాయం కావాల్సిన వారు జిల్లా న్యాయసేవాధికార సంస్థను నేరుగా సంప్రదించా లని తెలిపారు. లోక్అదాలత్‌లో వేగంగా కేసులు పరిష్కారం అవటమే కాకుండా ఇతర ప్రయోజ నాలు ఉన్నాయన్నారు. కక్షిదారులు న్యాయస్థానా నికి కట్టిన కోర్టు ఫీజు తిరిగి పొందవచ్చని వివరిం చారు. లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి కక్షి దారులకు న్యాయ సమ్మతమైన కక్షిదారుల సమ్మతమైన నిబంధనలతో అవార్డు ఇస్తారన్నారు. దీని మీద అప్పీలుకి వీలులేకపోవటం వల్ల ఇదే చివరి తీర్పు అవుతుందని చెప్పారు. కావున మెదక్ జిల్లా కక్షిదారులు అందరూ ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకొని ఈ జాతీయ లోక్ అదాలత్‌ని విజయవంతం చేయాలని, ప్రజలందరూ ఒక సామరస్య వాతావరణంలో ప్రశాంతంగా జీవించా లని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కోరుతుందని వివరించారు.

# నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు

### -పరీక్షలు జరిగే ప్రదేశాలలో బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 అమలు.. మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**కొల్చారం, మార్చి 4 ప్రభాతవార్త:** మార్చి 5 నుంచి 23వ తేదీ వరకు జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణలో భాగంగా మంగళవారం కొల్చారం గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరగనున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల కేంద్రాన్ని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రాహుల్‌రాజ్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షలకు 30 సెంటర్లలో ఇంటర్ మొదటి సంవత్సరం 6066 మంది, రెండవ సంవత్సరం 6,418 మంది విద్యార్థులు పరీక్ష వ్రాయనున్నారని తెలిపారు. ఇందులో జనరల్ 11,408 మంది, ఒకేషనల్ 1026మంది విద్యార్తులు, మొత్తం జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం, ఒకేషనల్ మొత్తం కలిపి 12,484 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉందని చెప్పారు. పరీక్ష నిర్వహణ కోసం పరీక్ష కేంద్రాల నియమనిబంధనల ప్రకారం అందులో ఉండాల్సిన మౌలిక వసతుల గురించి ఆరా తీశారు. విద్యార్థులు ఎటువంటి ఇబ్బందీ లేకుండా పరీక్ష రాసేందుకు వీలుగా బెంచీలు, కుర్చీలు, త్రాగునీరు, మూత్రశాలలు, సీసీ కెమెరాల పనితీరు, తరగతి గదులు, లైటింగ్, ఫ్యాన్లు, విద్యుత్ సరఫరా తదితరాల వంటి సౌకర్యాలను పర్యవేక్షించి, సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు పరీక్ష కేంద్రాలకు అనుమతించరాదన్నారు. పరీక్షలు నిర్వహించి ఏరియాలలో జిరాక్స్ దుకాణాలు మూసివేయాలని, పోలీస్ ఎస్కార్ట్‌తో ప్రభుత్వ వాహనంలో పరీక్ష పేపర్లను తరలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట కుల్చారం తహశీల్దార్ గఫార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పరీక్ష కేద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్


మాట్లాడుతున్న జిల్లా ఎస్పి ఉదయ్‌కుమార్‌రెడ్డి

## బంగారం చోరీ కేసులో ఏడుగురి అరెస్ట్

### -జిల్లా ఎస్పి ఉదయ్‌కుమార్‌రెడ్డి

**పాపన్నపేట, మార్చి 4, ప్రభాతవార్త:** ఆలయాలకు దైవదర్శనానికి వచ్చే భక్తులకు భద్రత కల్పించడం పోలీసుల బాధ్యత అని జిల్లా ఎస్పి ఉదయ్ కుమార్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఏడుపాయల ఆలయ ఆవరణలో భక్తుల వద్ద బంగారం చోరీ చేసిన నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపిన సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఉదయ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఏడుపాయలకు అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు రాత్రిళ్ల నిద్రలో ఉండగా చోరీకి పాల్పడిన వ్యక్తులను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారన్నారు. నిందితుల వద్ద 12 తులాల బంగారు ఆభరణాలను, నిందితులు ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నామన్నారు. రంగంపేటకు చెందిన వడ్డే యాదయ్య, శివంపేటకు చెందిన నవీన్ (ఆటో డ్రైవర్), ఉప్పరి సాయికుమార్, ఆలకుంట నరేష్, మక్కాని పవన్, వడ్డే శ్రీకాంత్, చిన్న ఘనపూర్‌కు చెందిన వడ్డే నర్సింలులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపామన్నారు. దొంగతనాల కేసును చేధించిన మెదక్ రూరల్ సిఐ రాజశేఖర్ రెడ్డి, సిసిఎస్ సిఐ రాజారెడ్డి, పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్, ఎఎస్ఐ సంగయ్య, కానిస్టేబుళ్లు దుర్గా ప్రసాద్ దత్తు, విజయ్ నిర్మల, యాదగిరిలను ఎస్పి ప్రత్యేకంగా అభినందించి రివార్డులను అందచేశారు. కార్యక్రమంలో మెదక్ డిఎస్పి ప్రసన్నకుమార్, సిసిఎస్ సిఐ రాజశేఖర్‌లు పాల్గొన్నారు.


కల్వర్టుపై ప్రమాదకరంగా మానిక గుంత దృశ్యం

## కల్వర్టుపై ప్రమాదకరంగా గుంత

### పట్టించుకోని అధికారులు, పాలకులు

**అల్లాదుర్గం, మార్చి 4, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ముప్పారం గ్రామానికి వెళ్లే చక్కని బిటి రోడ్డుపై నిర్మించిన కల్వర్టుపై పెద్ద గుంత(5 ఫీట్ల లోతువరకు) ఏర్పడి ప్రమాదకరంగా మారినా అధికారులకు కాని, పాలకులకు కాని పట్టింపులేకుండా పోయింది. కల్వర్టుపై ఏర్పడ్డ గోతిలో పడి వ్యక్తులు క్షతగాత్రులు అయినే కాని అధికారులు,పాలకులు ఆటువైపుగా చేసేలా లేరని ప్రయాణీకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ రోడ్డు గుండా నిత్యం అనేక వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. చిన్నపాటి వ్యయంతో మరమ్మత్తులు చేసే అవకాశం ఉన్నా ఎవరికి పట్టకపోవడం ఏమిటని ప్రజలు నీలదీస్తున్నారు. కల్వర్టుపై ఏర్పడిన గోతి గుండాగానే అధికారులు ముప్పారంకు వెళుతున్నా వారికి ప్రమాదకరంగా మారిని గోతి కానరావడం లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అందమైన బిటి రోడ్డుపై ప్రమాదకరంగా మారిన గుంతను వెంటనే పూడ్చి వాహన చోదకులు నిర్భయంగా ప్రయాణం చేసేలా చూడాలని సంబంధిత అధికారులకు ప్రజల సూచిస్తున్నారు.

## అంగన్‌వాడీలో పురుగుల సాంబార్

**చిన్నశంకరంపేట, మార్చి 4,ప్రభాతవార్త:**

ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తుంటే కొందరి నిర్లక్ష్యం వల్ల ఆహారం పురుగుల ఆహారంగా మారుతుంది. మండల పరిధి ఎస్.కొండాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం సెక్టార్–2లో గర్భిణీ స్త్రీలకు ఇచ్చే సాంబార్‌లో పురుగులు కనిపించడంతో గర్భిణీ స్త్రీలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఇలాంటి ఆహారం తింటే ఆరోగ్యంగా ఉండటం కాదుకదా ఉన్న ప్రాణం పోతుందని నిర్వాహకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే ఆహారం చిన్నపిల్లలు తింటే వారి పరిస్థితి ఎంటని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలా చేస్తున్న నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు. కాగా ఈ విషయమై 'వార్త' అంగన్‌వాడి సూపర్‌వైజర్ అంజమ్మను వివరణ కోసం పలుమార్లు సంప్రదించడానికి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.


అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీలకు ఇచ్చిన సాంబార్‌లో పురుగులు

## ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

### -చీఫ్ సూపరింటెండెంట్ మణికాంత్‌రావు

**కౌడిపల్లి, మార్చి 4, ప్రభాతవార్త:** నేటి(మంగళవారం) నుండి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట పరీక్షలకు మండల కేంద్రంలోగల ప్రభుత్వ జూనియర్ కళశాలను పరీక్ష కేంద్రంగా ఎంపిక కావడంతో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ మణికాంత్‌రావు మంగళవారం ఒక పత్రకటనలో తెలిపారు. బుధవాంం ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్ష ప్రారంభంతో కొనసాగే ఇంటర్‌పరీక్షలకు కేంద్రంలో అన్ని వసతులను సమకూర్చినట్లు ఆయన తెలిపారు. ఈ కేంద్రంలో మండల వ్యాప్తంగా ఐదు ప్రభుత్వ జూనియర్ కళశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఐదు కళాశాలలకు చెందిన ప్రథమ సంవత్సరం నుండి 350 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం నుండి 340 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నట్లు ఆయన తెలిపారు. వేసవి కాలం దృష్ట్య పరీక్ష కేంద్రంలో నీటి వసతితో పాటు విద్యార్థులకు ఆస్వస్థతకు గురైన, ఆందోళనకు చెందిన విద్యార్థులకు ప్రథమ చికిత్సలు చేయడానికి గా ఒక ఎఎన్ఎం, ఆశ వర్కర్‌లను పరీక్ష సమయం అయ్యేవరకు అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు. కౌడిపల్లి జూనియర్ కళశాల పరీక్ష కేంద్రంకు చీఫ్ సూపరింటెండెంట్‌గా మణి కాంత్ రావు, డిపార్టుమెంటల్ ఆఫీసర్‌గా ఎం. ప్రభాకర్, 16 మంది ఇన్విజ్లేటర్లు పనిచేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## పరీక్షలకు సర్వం సిద్ధం


విద్యార్థులకు హాల్‌టికెట్లు అందజేస్తున్న ఎంఇవో

**చిన్నశంకరంపేట, మార్చి 4,ప్రభాతవార్త:** నేటి(మంగళవారం) నుండి ఇంటర్ ప్రథమ, ద్వితీయ పరీక్షలకు చిన్నశంకరంపేటలోని ఆదర్శ పాఠశాలలో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలను అధికారులు సర్వం సిద్ధం చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 232 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఇంచార్జి ప్రిన్సిపల్ భూపాల్ తెలిపారు. అలాగే ఆదర్శ పాఠశాలలో 253 మంది పరీక్షలు రాయనున్నట్లు ప్రిన్సిపల్ వాణిదత్ తెలిపారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి సమయానికంటే ముందే చేరుకోవాలని సూచించారు.

## మెదక్ జిల్లాలో చిరుత కలకలం

**పెద్దశంకరంపేట, మార్చి 4 ప్రభాతవార్త:** మెదక్ జిల్లాలోని పెద్ద శంకరంపేట మండలం గొట్టిముక్కుల గ్రామ శివారులో చిరుత సంచారం మరోసారి కలకలం రేపింది. మంగళవారం తెల్లవారు జామున అదే గ్రామానికి చెందిన గౌస్ అనే రైతు పొలం వద్ద ఉన్న లేగదూడపై దాడి చేయడంతో అది మృతి చెందింది. గ్రామస్థులు ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీ శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ ప్రాంతంలో చిరుత పాదముద్రలు గుర్తించి చిరుత సంచరిస్తుందని ధ్రువీకరించారు. గ్రామస్థులు రాత్రి వేళ ఒంటరిగా బయటకు రావద్దని, పొలాల వద్దకు వెళ్లాలంటే గుంపులుగా కలిసి వెళ్లాలని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వికాస్ సూచించారు.


మృతి చెందిన లేగదూడను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

## బైక్‌పై నుంచి పడి ఉద్యోగి దుర్మరణం

**అమీన్‌పూర్, మార్చి 4 ప్రభాతవార్త:** డ్యూటీ ముగించుకొని బైక్‌పై ఇంటికి వెళ్తుండగా అదుపుతప్పి కింద పడడంతో నీలకంఠేశ్వరరావు తలకు తీవ్ర గాయమై మృతి చెందిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీతారామపురంగ్రామం, శ్రీకాకుళం జిల్లాకు చెందిన నీలకంఠేశ్వరరావు(30) సంవత్సరం క్రితం వృత్తిరీత్యా హైదరాబాద్ వచ్చి సుల్తాన్‌పూర్‌లోని ఒక ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి నీలకంఠేశ్వరరావు డ్యూటీ ముగించుకొని ఇంటికి మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా మార్గమధ్యలో రాత్రి 10గంటల సమయంలో సుల్తాన్‌పూర్ గ్రామంలోని కళ్యాణి వెంచర్ వద్దకు చేరగానే అక్కడఉన్న స్పీడ్ బ్రేకర్ వద్ద తన బైక్‌పై నుండి అదుపుతప్పి కిందపడగా తలకి తీవ్ర గాయమైంది. అతడితోపాటు పనిచేసే అక్షయ్‌కుమార్ చూసి కంపెనీ యాజమాన్యానికి తెలియజేయగా వారు చికిత్స నిమిత్తం పటాన్ చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడి నుండి ధ్రువ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి పెద్ద నాన్న కుమారుడైన సోమేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ దుర్గయ్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టడం జరిగింది.

## పేకాటరాయుళ్ల అరెస్ట్

**మర్కుక్, మార్చి 4 (ప్రభాతవార్త):** మండల కేంద్రం శివారులో పలువురు వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, పోలీసులు దాడిచేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుండి రూ.8,590 నగదు, 5 మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకొని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పేకాట ఆడినవారిలో మర్కుక్‌కు చెందిన పాపోల్ల బాలరాజు, రంగాకృష్ణ, బత్తుల నరేష్, మొర్సు రవీందర్ రెడ్డిలను అదుపులోకి తీసుకోగా ఎర్రగుంట ప్రవీణ్, బయ్యారి రాంసింగ్, అన్నారం నాగిరెడ్డి, నీరుడి నాగరాజు, అచ్చంగారి పాండురంగం పారిపోయినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ గ్రామాల్లో, పట్టణాల్లో, ఫాంహౌజ్, ఇళ్లలో పేకాట, బహిరంగ ప్రదేశాలలో జూదం మరే ఇతర చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించినట్లయితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడినట్లయితే టాస్క్‌ఫోర్స్ అధికారులకు 8712667445, 8712667446, 8712667447 నెంబర్లకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

### రూ.15వేలు జరిమాన


రెవెన్యూ అధికారులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

**ధూళిమిట్ట,మార్చి 4, ప్రభాతవార్త:** ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ సింహాచలం మధుసూదన్ మాట్లాడుతూ కొండాపూర్ గ్రామానికి చెందిన మందరాజు,డ్రైవర్ పుల్లూర్ రవిలు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా జాలపల్లి గ్రామంలో పట్టుకుని, రూ.15వేలు జరిమాన విధించినట్లు తెలిపారు.

## ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తే చర్యలు : ట్రాఫిక్ సిఐ

**గజ్వేల్ టౌన్, మార్చి 4 (ప్రభాతవార్త):** ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ వాహనాలను నిలిపే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని పలు దుకాణాల యజమానులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మురళి మాట్లాడుతూ వాహనదారులు పార్కింగ్ స్థలంలోనే వాహనాలను పార్కింగ్ చేయాలని, ఇష్టంవచ్చినట్లు పార్కింగ్ చేస్తే చలాన్ వేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ జగదీష్, హెడ్ కానిస్టేబుల్ సాంబశివరావు, కానిస్టేబుల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


రాంగ్ పార్కింగ్ చేసిన వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్తున్న దృశ్యం

# చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తాం

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**కొల్చారం, మార్చి 4 ప్రభాతవార్త:** సాగునీటి నిర్వహణ సమర్థవంతంగా అమలు చేయడంలో పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు మెదక్‌జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మంగళవారం కొల్చారం మండలం వరిగుంతం గ్రామంలో రైతులతో కలిసి వరి పంటను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి నీటిపారుదల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాహుల్‌రాజ్ మాట్లాడుతూ జిల్లాలో వేసవి కాలంలో వరి పంటకు నీటిపారుదల శాఖ ద్వారా నిర్దేశించబడిన ఆయకట్టుకు సాగునీరు చివరి ఆయకట్టు వరకు అందుతుందని తెలిపారు. ప్రస్తుతం అయితే వరి పంటకు నీటి కొరత లేదని పేర్కొన్నారు. రైతులకు సాగునీరు సరఫరాపై అవసరమైన సహాయాన్ని అందిస్తున్నట్లు ముఖ్యంగా నీటి నిర్వహణ, మోటార్లకు నిరంతర విద్యుత్ సరఫరావంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరం ఉన్న మేరకు మాత్రమే భూగర్భ జలాలు ఉపయోగించాలని, వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకుని భూగర్భ జలాలను పొదుపుగా ఉపయోగించాలని చెప్పారు.

ఎండకాలంలో పంటలను రక్షించేందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటుందని దానికనుగుణంగా పని చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ వ్యవసాయ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


వరి పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

## ప్రారంభమైన రామలింగేశ్వరస్వామి కళ్యాణోత్సవాలు



పూజలందుకున్న శ్రీదాక్షాయణి రామలింగేశ్వరస్వామి

**మేడ్చల్, మార్చి 4, ప్రభాతవార్త:**
మేడ్చల్‌పట్టణంలోని శ్రీదాక్షాయణి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ కళ్యాణమహోత్సవాలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలోభాగంగా చేపడుతున్న ఉత్సవాల్లో మొదటిరోజు మంగళవారం అంకురార్పణ అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా స్వామి వారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. రాత్రికి నందీశ్వరసేవ ఊరేగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈకార్యక్రమంలో ఆలయకుటుంబధర్మకర్త దాత్రిక రాధాకృష్ణమూర్తి, ఉత్సవకమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్‌లో బిజెపి సంబరాలు




సంబరాలు జరుపుకుంటున్న బిజెపి నేతలు

**షాద్‌నగర్ రూరల్, మార్చి 4, ప్రభాతవార్త:**
ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి కొమరయ్య గెలుపుతో షాద్‌నగర్ పట్టణంలోని ముఖ్యకూడలిలో బిజెపి శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఈకార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, తదితరనేతలు హాజరై కార్యకర్తలతో కలిసి సంబరాలు చేసుకున్నారు. ఈసందర్భంగా పలువురునేతలు మాట్లాడుతూ... తెలంగాణరాష్ట్రంలో ఎన్నికైనగెలుపు బిజెపిదే అవుతుందని అన్నారు. ఉపాధ్యాయ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే విజయం సాధించిన కొమురయ్యకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని నమ్మే పరిస్థితిలో ప్రజలులేరని, ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చలేకపోయిందని వారు విమర్శించారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో సహితం బిజెపిపార్టీ విజయ ధుంధుభి మ్రోగిస్తుందని వారు అన్నారు. ఈకార్యక్రమంలో కొత్తూరు, కొందుర్గు మండలాల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి, అత్తాపూర్ మహేందర్‌రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, చెట్ల వెంకటేష్, మల్చలం మురళీ, సుధాకర్ అప్పు, బాల్‌రెడ్డి, నర్సింలు, కుడుముల బాల్‌రాజ్, రంగన్నగౌడ్, రాము, గట్టాజీ విజయ్, హన్మంత్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలు, మహిళల భద్రతపై అవగాహన
-ఎస్ఐ అనిత



చింతకుంట గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అనిత

**ధారూరు, మార్చి 4, ప్రభాతవార్త:**
సామాజిక అంశాలు, సైబర్‌నేరాలు, మహిళలభద్రత, 100డయల్, తదితర అంశాలపై అవగాహనకార్యక్రమాన్ని వికారాబాద్‌జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి ఆదేశాలమేరకు అవగాహనకార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎస్ఐ అనిత తెలిపారు. సోమవారంరాత్రి మండలపరిధిలోని చింతకుంటగ్రామంలో కళాబృందంతోకలిసి ప్రొజెక్టర్‌ద్వారా వీడియోచేసి చూపించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, ముఖ్యంగా సైబర్‌నేరాలకు మోసపోవద్దని చెప్పారు. సామాజిక అంశాలపై సైబర్‌నేరాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. మీ మొబైల్లో తెలియని వ్యక్తులకు ఓటీపీలు చెప్పవద్దని డబ్బులు ఆశచూపించి లేనిపోని మాటలుచెప్పి మిమ్ములను మోసపెట్టేవిధంగా వారు పక్కాప్రణాళిక తయారుచేసుకొని మీకు వాట్సాప్‌లో ఏదో ఒకమెసేజ్ పంపించి మిమ్ములను ఓటిపి వచ్చింది, మీకు ఏదో ఒకటి వస్తుందని మోసగించేవిధంగా ప్రయత్నాలు చేస్తున్నారని వాటికి ఎవరుకూడా మోసపోవద్దని ఎవరు ఓటిపి అడిగినా చెప్పవద్దని అన్నారు. డ్రగ్స్, గంజాయి లాంటి నిషేధిత మత్తుపదార్థాలకు యువత బానిసకావొద్దు అన్నారు. ద్విచక్రవాహనాలపై ప్రయాణించేటప్పుడు మద్యంసేవించరాదని ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధర్మించాలని సూచించారు. ఎక్కడైనా నేరాలుజరుగుతుంటే 100కి డయల్ చేయాలని చెప్పారు. బాల్యవివాహాలు చేస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కళాబృందం, ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థులు కష్టంతో పాటు ఇష్టపడి చదవాలి
-డిఎస్పి బాలక్రిష్ణరెడ్డి



మాట్లాడుతున్న డిఎస్పి బాలక్రిష్ణరెడ్డి

**పెద్దేముల్, మార్చి 4, ప్రభాతవార్త:**
ప్రతివిద్యార్థికి జీవితంలో 10వ తరగతి పరీక్షలు అత్యంత కీలకమని, అందుకు కష్టంతోపాటు ఇష్టపడి చదివి లక్ష్యాన్ని సాధించాలని తాండూరు డిఎస్పి బాలక్రిష్ణరెడ్డి అన్నారు. మంగళవారం పెద్దేముల్ మండలంలోని గొట్లపల్లి మోడల్ స్కూల్‌లో రానున్న పదవతరగతి పరీక్షలపై విద్యార్థులకు మనోధైర్యం కల్పించేందుకు అవగాహనకార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డిఎస్పి బాలక్రిష్ణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బయపడకుండా ప్రశాంతవాతవరణంలో పరీక్షలురాయాలని అన్నారు. పదవతరగతి పరీక్షలలో వచ్చేమార్కులు మునుముందు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఉపాధ్యాయులు సూచించే సూచనలను విద్యార్థులు పాటించాలని అన్నారు. విద్యార్థిదశలో కీలకమైనమలుపు 10వ తరగతి పరీక్షలని, అందుకు ఉత్తమ ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యావ్యవస్థను ఎవరు భ్రష్టుపట్టించారో తేల్చుకుందాం

### పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షుడు ఎంఎస్ నటరాజన్




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

**షాద్‌నగర్, మార్చి 4, ప్రభాతవార్త:**
షాద్‌నగర్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ఏకార్యక్రమం జరిగినా అధికారపార్టీ నాయకులు ప్రతిపక్షాన్ని గోక్కోవడం సంప్రదాయంగా మార్చుకున్నారని, విద్యావ్యవస్థను నియోజకవర్గంలో ఎవరు భ్రష్టుపట్టించారో తేల్చుకుందామని పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షుడు ఎం.ఎస్.నటరాజన్ సవాల్ విసిరారు. మంగళవారం బిఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఫరూఖ్‌నగర్ ప్రభుత్వఉన్నతపాఠశాలకు రూ.43.50 లక్షలరూపాయలు మంజూరు చేయంచడం వరకు బాగానే ఉంది కానీ అభివృద్ధి పనులు చేసుకోకుండా ప్రతిపక్షంపై అనవసరపు ఆరోపణలుచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గతంలో ఇదేపాఠశాలకు తమ నాయకుడు వై.అంజయ్యయాదవ్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రూ.71లక్షలను మన ఊరు మన బడి కింద మంజూరుచేయించారని, కాంట్రాక్టర్ఒప్పందం జరిగిందని, అయితే తమప్రభుత్వం లేనికారణంగా ఆపనులు అక్కడే నిలిచిపోయాయని గుర్తుచేశారు. అంతకుముందు అదేచోట నిర్మించిన భవనానికి కాంట్రాక్టర్ ఎవరో తెలుసుకోవాలని సూచించారు. పాఠశాల ఆవరణలో నిర్మించిన భవనాలను పరిశీలిస్తే ఎంత నాసిరకంగా కట్టారో అర్థమవుతుందని, సదరు కాంట్రాక్టర్ ఇతరులను విమర్శించడం విడ్డూరంగా ఉందని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తమనాయకుడు వై.అంజయ్యయాదవ్ మనఊరు మనబడి పథకంద్వారా ఎన్నోపాఠశాలలను తీర్చిదిద్దారని అన్నారు. గతంలో డిగ్రీ కళాశాల భవనం ఏడుగదులే నిర్మించి ఉండేవని, అంజయ్య యాదవ్ ఎమ్మెల్యే అయ్యాక డిగ్రీ కళాశాలను పూర్తి చేశామని గుర్తుచేశారు. సదరు డిగ్రీ కళాశాలకు రూ.50 లక్షలకుపైగా వెచ్చించి ప్రహరీగోడ నిర్మిస్తే దానిబిల్లుకూడా చెల్లించలేదని మండిపడ్డారు. ప్రభుత్వాలు మారుతున్న క్రమంలో కాంగ్రెస్, టిడిపి, బిఆర్ఎస్‌పార్టీలప్రభుత్వాలు ఇప్పటివరకు పాలించాయని, నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధిపనులు మిగిలినక్రమంలో ఏప్రభుత్వంవచ్చినా వాటిని పూర్తి చేసేదని, కానీ కాంగ్రెస్‌ప్రభుత్వంవచ్చాక చేసినపనులకు కనీసం బిల్లులుకూడా ఇవ్వలేని దుస్థితి ఏర్పడిందని అన్నారు. సర్వశిక్ష అభియాన్, మనఊరు మనబడి ఇలాంటి ఎన్నోపథకాలతో అభివృద్ధిపనులు, విద్యావికాసం జరిగిందన్నారు. జెపి దర్గా వద్ద ఎస్సీ రెసిడెన్షియల్ బాయ్స్‌స్కూల్‌వద్ద కోట్ల రూపాయలు వెచ్చించి భవనంనిర్మించలేదా అని ప్రశ్నించారు. కొందుర్గువద్ద కస్తూర్బాపాఠశాలను నిర్మించలేదా అని ప్రశ్నించారు. హైస్కూల్ విషయంలో మాజీఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ను విమర్శించడం సరికాదని హితవుపలికారు. అధికారపార్టీని అవకాశందొరికితే తాము గోకుదామనిచూస్తుంటే రివర్స్‌గా అధికారపార్టీనాయకులే తమను గోక్కుంటున్నారని, నష్టంవాళ్లకేనని నటరాజన్ అన్నారు.

**పాఠశాలభవనం కూల్చినతర్వాత టేకు,కలప ఏమయ్యింది..?**
ఫరూఖ్‌నగర్ ప్రభుత్వ ఉన్నతపాఠశాల భవనం కూల్చివేసిన క్రమంలో దానికి సంబంధించిన టేకు కలప ప్రస్తావనకు వచ్చింది. అసలు ఆకలప ఏమయ్యిందని, ఎవరు తీసుకున్నారని ప్రశ్నించారు. కలప మాయంచేసింది ఎవరని, ఎక్కడివారని ఈ సందర్భంగా మీడియాసమావేశంలోచర్చకువచ్చింది. విలువైనకలపను ఎవరు తీసుకువెళ్లారు, అసలు ఏం జరిగింది..? వాటిలబ్ధి ఎవరుపొందారన్నది ఇప్పుడు ఈ అంశంలో కొత్తమలుపుగా భావించవచ్చు. ఈ మీడియాసమావేశంలో బిఆర్ఎస్ నాయకులు చీపిరి రవియాదవ్, కానుగు అనంతయ్య, పిల్లి శేఖర్, గుండు అశోక్, రాజశేఖర్, శీలం శ్రీకాంత్, చిన్న, జూపల్లి శంకర్, మాజీ ఎంపిటిసి బీష్వ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నేటినుంచి ఇంటర్‌పరీక్షలు ప్రారంభం
-పకడ్బందీగా ఏర్పాట్లు..డిఐఇఒ ఎం.కిషన్

-జిల్లావ్యాప్తంగా 150 పరీక్షాకేంద్రాలు

-పరీక్షలు రాయనున్న 1,26,423మంది విద్యార్థులు

**మేడ్చల్‌జిల్లా ప్రతినిధి, మార్చి 4, ప్రభాతవార్త:**
ఇంటర్‌పరీక్షలు బుధవారంనుంచి ప్రారంభమవుతున్నాయి. దీనికిసంబంధించి మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఇంటర్ అధికారులు అన్ని ఏర్పాట్లుచేశారు. ఈనెల 5నుంచి 25వ తేదీవరకు ఇంటర్‌పరీక్షలు జరగనున్నాయి. బుధవారం ఇంటర్మీడియట్ మొదటిసంవత్సరం పరీక్షలు ప్రారంభంకానున్నాయి. రెండవ సంవత్సరం పరీక్షలనిర్వహణకు కూడ అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. మంగళవారం జిల్లా ఇంటర్ విద్యా అధికారి ఎం.కిషన్ ఇంటర్‌పరీక్షల నిర్వాహణ వివరాలను వివరించారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లావ్యాప్తంగా ఇంటర్‌పరీక్షలకోసం 150 పరీక్షాకేంద్రాలు ఏర్పాటుచేశారు. వీటిలో ప్రభుత్వకళాశాలల్లో నాలుగుకేంద్రాలు, ప్రైవేట్ సెక్టార్‌కు సంబంధించిన పరీక్షాకేంద్రాలు ఐదు, మిగతా 141పరీక్షా కేంద్రాలు ప్రైవేట్‌కళాశాలల్లో ఏర్పాటుచేయటం జరిగిందన్నారు. మొదటి సంవత్సరంపరీక్షలకు విద్యార్థులు 64,107మంది, రెండవసంవత్సరం విద్యార్థులు 62,316మంది పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. మొత్తం ఇంటర్ పరీక్షలకు 1,26,423మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈపరీక్షల నిర్వహణకు ప్రిన్సిపల్స్ హిమైతుల్లా, సీనియర్ లెక్చరర్ విద్యాసాగర్‌రెడ్డి వీరి ఆధ్వర్యంలో హైపవర్ కమిటీ పనిచేస్తుందన్నారు. ఫ్లైయింగ్‌స్క్వాడ్స్ 4 టీమ్‌లు, సిట్టింగ్‌స్క్వాడ్స్ 5టీమ్‌లు, పనిచేయనున్నట్లు తెలిపారు. వీటితో పాటు డిఇసి డిస్ట్రిక్ట్ ఎక్జామినేషన్‌కమిటీ నిర్వాహకులుగా బి.వెంకటయ్య ప్రిన్సిపల్ కూకట్‌పల్లి, డి.నాగేందర్ ప్రిన్సిపల్ కుత్బుల్లాపూర్, ఉమాదేవి ప్రిన్సిపల్ మల్కాజ్‌గిరి, సీనియర్ అధ్యాపకులు ఉపేందర్, శోభారాణిలను నియమించటంజరిగిందన్నారు. వీరితోపాటు హెల్త్‌డిపార్ట్‌మెంట్, ఆర్టీసిడిపార్ట్‌మెంట్, ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్ వారిసహకారంతో పరీక్షలను సజావుగా నిర్వహించటానికి అన్ని ఏర్పాట్లుచేసినట్లు ఇంటర్ విద్యాధికారి ఎం.కిషన్ తెలిపారు. జిల్లాకలెక్టర్ ఆధ్వర్యంలో రెవెన్యూశాఖ, పోలీస్‌శాఖ, ఆరోగ్యశాఖ, విద్యుత్‌శాఖ, ఆర్టీసిశాఖ వారితో కోఆర్డినేషన్ సమావేశం కూడ ఇంటర్‌పరీక్షల కోసం నిర్వహించటం జరిగిందన్నారు. పరీక్షాకేంద్రాలకు విద్యార్థులు ఉదయం 8.30 గంటలవరకు చేరుకోవాలన్నారు. పరీక్షలను ప్రశాంతంగానిర్వహించటానికి అన్ని చర్యలు తీసుకున్నామని ఇంటర్ విద్యాధికారి ఎం.కిషన్ పేర్కొన్నారు.

## సుమన్ హౌజింగ్ కాలనీలో శాశ్వత మరమ్మతులకు చర్యలు : ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్, మార్చి 4 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ బోర్డు, జిహెచ్ ఎంసి సరిహద్దుల్లో ఉన్న డ్రైనేజీ మురుగునీరు శాశ్వత మరమ్మ త్తుల పరిష్కారానికి బోర్డు, జిహెచ్ఎంసి, జలమండలి అధికారులు కలిసి కో-ఆర్డినేషన్‌తో సమస్యను పరిష్కరించాలని కంటో న్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం వెస్ట్ మారేడ్‌పల్లి ప్రధాన రోడ్డు మార్గం లోని సుమన్ హౌజింగ్ కాలనీ వద్ద కొన్ని నెలల నుంచి డ్రైనేజీ మురుగునీరు ఏరులై పారుతుంది. ఈ సమస్యను పరిష్కరించ దంలో అటు కంటోన్మెంట్ బోర్డు, ఇటు జిహెచ్ఎంసి, జలమండ లి అధికారులు శాశ్వత మరమ్మత్తులు చేపట్టకపోవడంతో సమస్య జఠిలంగా మారింది. ఈ సమస్యపై అధికారులు సంయుక్తంగా కలిసిసి మరమ్మత్తులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బోర్డు శానిటరీ సూపరిండెంట్ ఎం.దేవేందర్, జలమండలి డిజిఎం విద్యాసాగర్, కాంగ్రెస్ నేత చిర్రబోయిన సంతోష్ యాదవ్, సుమన్ కాలనీ అధ్యక్షుడు సిఎం ప్రకాశ్, మహేశ్, పాల్గొన్నారు.

## నీటి సరఫరా,డ్రైనేజీ పైపులైన్ ఏర్పాటు చేయండి

**బేగంబజార్, మార్చి4 ప్రభాతవార్త:** గచ్చిబౌలి టిఎన్‌జిఒ మంచవల్లి ఎయిడెడ్ కోపరేటివ్ హౌజింగ్ సొసైటిలో మంచినీటి సౌకర్యం, మురుగునీటి పైపులైన్ నిర్మాణ పనులను చేయిం చాలని జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డినికలిసి సొసైటి కార్యదర్శి, టిఎన్‌జిఒ కేంద్రసంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ, సొసైటి బోర్డు ఆఫ్ డైరెక్టర్ కస్తూరి వెంకటేశ్వర్లు, జనరల్‌మేనేజర్ ఖాదర్‌లు నేతృత్వంలో కలిసి సొసైటి ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి వినతి పత్రం అందచేశారు. సంఘం విజ్ఞప్తి మేరకు ఎండి అశోక్‌రెడ్డి వెంటనే స్పందించి టిఎన్‌జిఒ కాలని సమస్యలు వెంటనే పరిష్కారం అయ్యేలా నూతన డ్రైనేజీ పైపులైన్‌ల ఏర్పాటు చేయించడం జరుగుతుందన్నారు. అదే విధంగా నల్లా కనెక్షన్లు ద్వారా సరఫరా అవుతున్న నీటి ప్రెషర్ పెంపు కోసం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## పోలీసులు వేధింపులు ఆపించండి
-మాజీ ఎమ్మెల్యే మైనంపల్లికి ఇసుక లారీల యజమానులు వేడుకోలు

**అల్వాల్, మార్చి 4 ప్రభాతవార్త:** ఎస్ఓటి పోలీసులు వేదింపులు నుంచి తమను రక్షించాలని కోరుతూ అల్వాల్ ఇసుక లారీల యజమానులు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లిని కోరారు. ఇటీవల కొంత కాలంగా ఇసుక డంప్‌లుపై ఎస్ఓటి పోలీసులు దాడులు తీవ్రతరం చేశారు. లారీలలో ఇసుక అమ్మిన తరువాత మిగిలిన దానికి బహిరంగ ప్రదేశాలులో డంప్ చేస్తున్నారు. డంప్ చేసిన ఇసుకకు వేబిల్లులు చూపించమని అడుతున్నారని ఇది ఎలా సాధ్యమని యజమానులు ప్రశ్నిస్తున్నారు. కేసులు నమోదు చేయడంతో పాటుగా లారీలు సీజ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా చిరు వ్యాపారులు పోలీసులు యాక్షన్ కార ణంగా తీవ్రంగా నష్ట పోతున్నారు. పోలీసులు ఇసుక వ్యాపా రులు మధ్య వివాదం ఇలా ఉండగా ఇసుక ధరలు పెరిగి పోయి భవన నిర్మాణదారులు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవా రం ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావును కలిసిన వీరు గోడును వెల్లడించారు. ఇసుక వ్యాపారులు నష్ట పోకుండా తన వంతు సహాయం చేస్తానని మైనంపల్లి వారికి హామీ ఇచ్చారు.

## సమ్మె సన్నాహక సభ

**జీడిమెట్ల, మార్చి 4 ప్రభాతవార్త :** టిజిఎస్ఆర్‌టీసీ కార్మిక జేఏసీ జీడిమెట్ల డిపో ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన సమ్మె సన్నాహ సందర్భంగా సభలో పాల్గొన్న జేఏసీ నాయకులు వెంకన్న, మౌలానా, కమలాకర గౌడ్, బాబు, గోవర్ధన్, అశోక్, హరిక్రిష్ణ, డానియల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, 2021 వేతన సవరణ చేయా లన్నారు. కారుణ్య నియామకాలు చేపట్టాలని, డ్రైవర్, కండక్టర్, నియామకాలు, కొత్త బస్సులు కొనుగోలు చేసి, ఆర్టీసీని బలోపేతం చేయాలని కోరారు.

## ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి : వాసుదేవరెడ్డి

**చేర్యాల, మార్చి 4, ప్రభాతవార్త :** ఈనెల23న షాహిత్ భగత్‌సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా హనుమకొండ నగరంలోని కాళోజి కళాక్షేత్రంలో జరిగే ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి సారంపెల్లి వాసుదేవరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం చేర్యాల పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో చేర్యాల, మద్దూరు మండలాల్లో పని చేసిన పూర్వ ఎస్ఎఫ్ఐ విద్యార్థుల సన్నాహక సమావేశం నిర్వహించారు. విద్యార్థి ఉద్యమం 1970 నుండి 2025 వరకు ఎస్ఎఫ్ఐలో పని చేసిన నాయకులు, కార్యకర్తలు పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం ఉంటుందని ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో పూర్వ, ప్రస్తుత నాయకులు గానుగుపాటి గంగాధర్, దొగ్గెల తిరుపతి, మొకు కనకారెడ్డి, రాళ్ళబండి గురుమూర్తి, రాళ్ళబండి పరిపూర్ణం, ఏనుగుల దుర్గయ్య, మేర్గొజు జనార్ధన్, సుంచ విజేందర్, కర్రోళ్ళ యాదగిరి, మాచెర్ల విష్ణు, గద్దల మహేందర్ బండమీది కరుణాకర్, బండకింది అరుణ్‌కుమార్, దాసరి ప్రశాంత్, ముస్త్యాల ప్రభాకర్, బక్కెళ్ళి బాలకిషన్, రాళ్ళబండి భాస్కర్, బొంగోని భాస్కర్, ఆముదాల రంజిత్, తాదూరి భరత్ తదితరులు ఉన్నారు.

## మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి త్వరగా కోలుకోవాలి నల్లపోచమ్మ ఆలయంలో పూజలు

**కౌడిపల్లి, మార్చి 4, ప్రభాతవార్త:**
గుండెకు శస్త్రచికిత్స చేసుకొని విశ్రాంతి పొందుతున్న నర్సాపూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి త్వరగా ఆరోగ్యవంతుడై ప్రజాక్షేత్రంలో ప్రజలకు సేవలు చేయాలని ఆశిస్తూ తునికి శ్రీ నల్ల పోచమ్మ ఆలయంలో టిఆర్ఎస మండల పార్టీ అధ్యక్షులు సార రామాగౌడు దంపతులు మంగళ వారం నాడు ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. గత రెండు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసి ప్రజలకు సేవలు చేసిన మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డికి గత కొన్ని నెలలుగా గుండె సంబంధ వ్యాధులతో బాధపడుతూ శస్త్ర చికిత్సలు చేసుకొని, తన స్వంత గృహంలో విశాంత్రి పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న రామగౌడు తునికి శ్రీ నల్ల పోచమ్మ ప్రత్యేక పూజలు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి శివప్ప, భక్తులు తదితరలు పాల్గొన్నారు.

## ఘనంగా సైన్స్ దినోత్సవం

**చిన్నశంకరంపేట, మార్చి 4,ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన చిన్నశంకరంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు చేసిన ప్రయోగాలను ప్రధానోపాధ్యాయులు దీప్లా నాయక్, ఎస్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్యలు పరిశీలించి అభినందించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండే ప్రయోగాలు చేస్తే శాస్త్రవేత్తలుగా ఎదుగుతారని అన్నారు. సీవి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లారెడ్డి, దయానా, పుష్పలత, స్వప్న, నవీన్ పాల్గొన్నారు.

## మహిళలు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

**కీసర, మార్చి 4, ప్రభాతవార్త :** మహిళలు ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని స్టార్ కన్వెన్షన్ హల్‌లో ఐఫోక్స్ ఫాక్స్ కంపెనీలో మహిళలకు నిర్వహించిన జాబ్‌మేళాకు మున్సిపాలిటీ నుండే కాక చుట్టు ప్రక్కల ప్రాంతాల వారు కూడా భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్దిపాటి ప్రచారం జరిగినప్పటికీ 150 లేదా 200 మంది ఈ స్థాయిలో ఉంటారనుకుని అటువంటి వారికి కూడా మన మున్సిపాలిటీలో ఈ కార్యక్రమం పెట్టి ఆదుకోవాలని ఆలోచనతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. కానీ ఒక ప్రైవేటు కంపెనీలో నెలకు 15 వేల రూపాయలు ఇంత పెద్ద ఎత్తున మహిళా సోదరీమణులు రావడం అయినప్పటికి బిటెక్, ఎమ్మెస్సీ, ఎంబిఏ, టెక్నీషియన్స్, పాలిటెక్నిక్ డిప్లొమా చేసిన వారు కూడా రావడం చూసి తన మనసుకు ఎంతో బాధ కలిగిందన్నారు. ప్రతి మహిళ తన సంపదతో తన ఇంటిని చక్కదిద్దగలదని మన దేశానికి కూడా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా ఒక మహిళ అన్ని చెప్పారు. మరొక్కసారి కూడా ఈ అవకాశాన్ని కల్పించాలని సదుద్దేశంతో మరొకసారి పెద్ద ఎత్తున జాబ్‌మేళా నిర్వహిస్తామని కంపెనీ వారు కూడా హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, కట్టె దివ్య దయాకర్, నాయకులు కౌకుట్ల రాహుల్‌రెడ్డి, శిలాసాగర్ నాగేందర్, నాగరాజు యాదవ్, రామక్కపేట రవీందర్‌రెడ్డి, మెరుగు శ్రీనివాస్ రెడ్డి, క్రిష్ణచారీ, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## పటాకులు కాల్చిన బిజెపి నేతలు

**సికింద్రాబాద్, మార్చి 4 ప్రభాతవార్త:**
ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఘనవిజయం సాధించిన బిజెపి అభ్యర్థి మల్కా కొమురయ్య సాధించిన విజయానికి సికింద్రాబాద్ నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సీతాఫల్మండి చౌరస్తాలో విజయోత్సవాలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సంద ర్భంగా స్వీట్లు పంచి పటాకులు పేల్చి సంబరాలు నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా పార్టీ అధ్యక్షులు భరత్ గౌడ్, కంటెస్టెడ్ ఎమ్మెల్యే మేకల సారంగ పాణి, కన్వీనర్ కె.నాగేశ్వర్ రెడ్డి, రాచమాల కృష్ణమూర్తి, కనకట్ల హరి, వేణు యాదవ్, రవి ప్రసాద్ గౌడ్, పోచయ్య యాదవ్, అనిత అనుష, సరోజ, రాజే శ్వరి, మంజుల, భానుమతి, డివిజన్ అధ్యక్షులు నరేష్, ఉపేందర్, ఆదర్శ్, సౌందర్య, సాయి, మాజీ అధ్యక్షులు రాజేశ్వరరావు, రాము వర్మ, హనుమంతు ముదిరాజ్, బీజే వైఎం మహిళా నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ గెలుపు రానున్న రోజులలో తెలంగాణలో బిజెపి ప్రభు త్వం ఏర్పాటు చేయడం ఖాయమని అందుకు ప్రజలు ముందుగానే ఎమ్మెల్సీ ఎలక్షన్లో విజయాన్ని అందించారని తెలిపారు.



విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

## విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే

**అమీన్‌పూర్, మార్చి 4 ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని కిష్టారెడ్డిపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన కట్ట మైసమ్మ దేవాలయం విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ కృష్ణ, వెంకట్ రెడ్డి, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలి



అగ్రహారంలోని పాఠశాలలో నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

**చిన్నశంకరంపేట, మార్చి 4,ప్రభాతవార్త:** విద్యార్థులు ప్రతి ఒక్క రంగంలో రాణించినప్పుడే ఉన్నత స్థానాలకు ఎదుగుతారని మండల విద్యాధికారి పుష్పవేణి అన్నారు. మంగళవారం మండల పరిధి అగ్రహారంలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు హుషారెత్తించాయి. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందించారు. పాఠశాల వార్షికోత్సవాన్ని నిర్వహించిన ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో ఎస్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య, పీఆర్టీయు జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్‌రెడ్డి, హరిబాబు, శివ ప్రసాద్, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, పురుషోత్తం, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలి



చిన్నశంకరంపేటలో ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో ఎల్లయ్య

**చిన్నశంకరంపేట, మార్చి 4, ప్రభాతవార్త:** వేసవిలో తాగునీటికి సమస్యలు లేకుండా చూడాలని జడ్పీ సీఈవో ఎల్లయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ప్రతి రోజు చేస్తున్న పనులను నిరంతరం నమోదు చేయాలని, విదులలో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. గ్రామాలలో పారిశుధ్య లోపం, తాగునీటి కొరత లేకుండా చూడాలని, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో దామోదర్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

## రామలింగేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు



రామలింగేశ్వర స్వామి ఆలయంలో హుండీ లెక్కింపు దృశ్యం

**ధూళిమిట్ట, మార్చి 4, ప్రభాతవార్త :** బెక్కల్ గ్రామంలోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం హుండీ లెక్కింపు నిర్వహించారు. దేవాలయ కార్యనిర్వహణ అధికారి కె.శ్రీధర్‌రెడ్డి, ఆలయ చైర్మన్, ధర్మకర్తల మండలి, కోటిలింగాల సేవాసమితి, అర్చకులు, సిబ్బంది ఇతర దేవాలయాల సిబ్బంది సమక్షంలో 39 రోజులకుగాను హుండీ లెక్కింపు జరపగా రూ. 79,844 ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు. ఆదాయాన్ని ఎస్‌బిఐలో జమచేయడం జరిగిందని ఆలయ కార్యనిర్వహణాధికారి తెలిపారు.

## చేర్యాల కోర్టులో 26 మందికి జరిమాన

**చేర్యాల, మార్చి 4,ప్రభాతవార్త :** తాగి వాహనాలు నడిపిన 26 మందికి ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల చొప్పున చేర్యాల కోర్టు ఇంచార్జ్ న్యాయమూర్తి ఎ.కృష్ణతేజ్ జరిమాన విధించారు. తాగి వాహనాలు నడిపితే కఠిన శిక్షలు ఉంటాయన్నారు. అదే విధంగా చిన్న చిన్న విషయాలకు గొడవలు పడి శిక్షలు పడే విధంగా ప్రవర్తించకూడదన్నారు. అలాగే ఈనెల 8న లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టాలు
ఎమ్మెల్సీ యాదవరెడ్డి

**గజ్వేల్ టౌన్, మార్చి 4 (ప్రభాతవార్త):** అమసర్థ కాంగ్రెస్ పాలనతో రైతులు అష్టకష్టాలు పడుతున్నారని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి ఆరోపించారు. సాగునీరు లేక ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతులకు కెసిఆర్ అండగా నిలబడి జిల్లాలో రంగనాయకసాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టులను నిర్మించారని, కెసిఆర్ పాలనలో మండుటెండల్లో సైతం చెరువు కుంటలు మత్తడి దూకి ప్రవహించేవని అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకుంటూ రైతులకు సాగునీరు ఇవ్వకుండా కక్షసాధింపు చర్యలు తీసుకుంటుందని అన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికి త్రాగునీరు అందించామని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే ఎండాకాలం రాకముందే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కాంగ్రెస్ నేతలు పదవుల కోసం కుములాడుకుంటూ నియోజకవర్గ ప్రజల సమస్యలు పట్టించుకోవడంలేదని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి ఘాటుగా విమర్శించారు. పంటలు ఎండిపోకముందే రైతులకు సాగునీరు అందించాలని ఎమ్మెల్సీ యాదవరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తల మృతి

**అల్లాదుర్గం( ప్రభాతవార్త) మార్చి 4 :** అల్లాదుర్గం మండలంలోని చిల్వర్ సమీపంలోని 161 జాతీయ రహదారిపై కారు ఢీకొని భార్యాభర్తలు దుర్మరణం చెందారు. పోలీసుల, స్థానికుల కథనం ప్రకారం అల్లాదుర్గం గ్రామానికి చెందిన బండ సాయిలు ( 50), బండ మానెమ్మ ( 48) ద్విచక్ర వాహనంపై టేక్మాల్ మండలం బొడ్మెట్పల్లి లో జరిగిన సంత నుండి తిరిగి వస్తుండగా చిల్వర్ 161 జాతీయ రహదారిపై కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకొని విచారణ చేపట్టారు. భార్యాభర్తలు మృతి చెందడంతో అల్లాదుర్గం కాన్సిరాం నగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.


చెక్కును అందిస్తున్న బ్యాంకు అధికారులు

## పేదలను ఆదుకునేందుకు రుణాలను అందిస్తున్న యుబిఐ : ఆర్ఎం వికాస్

**సిద్దిపేట రూరల్, మార్చి 4, ప్రభాతవార్త :** పేదలను ఆదుకునేందుకు యుబిఐ అనేక రకాల పథకాలను అందిస్తుందని యూనియన్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ వికాస్ అన్నారు. జిల్లాకేంద్రంలోని విపంచి కళా నిలయంలో మంగళవారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో మెగా ఎంఎస్ఎంఈ రుణ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట రీజినల్ పరిధిలో 65 యూనియన్ బ్యాంకు శాఖల ద్వారా రుణ సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. జిల్లాలో 23 శాఖలు పని చేస్తున్నాయన్నారు. మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్‌కు యూనియన్ ఎంఎస్ఈ సపోర్టు వంటి వివిధ పథకాల కింద రుణాలను అందిస్తుందన్నారు. రూ.50 వేల నుంచి రూ.5 లక్షలకు పైబడిన శ్రేణిలో అనుషంగిక ఉచిత రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. వివిధ దరఖాస్తుదారులకు రూ.60 కోట్ల ప్రాథమిక అమోదం ఇచ్చినట్లు తెలిపారు. ముద్రా పథకంలో మహిళలతో పాటు ఇతర లబ్దిదారులకు మంజూరు వచ్చినట్లు వివరించారు. ఎఫ్ఎంజిఓ ఆఫీస్ జెనరా, ఎల్‌డిఎం బి.హరిబాబులు డిప్యూటీ రీజినల్ హెడ్స్, స్థానిక మేనేజర్లు, ఎంఎస్ఎంఈ రుణగ్రహీతలు తదితరులు పాల్గొన్నారు.

## పొద్దుతిరుగుడు సాగులో మేలైన యాజమాన్య పద్దతులపై శిక్షణ


డ్రోన్‌తో బోరాక్స్ పిచికారి పద్దతిపై ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

**సిద్దిపేట అర్బన్, మార్చి 4,ప్రభాతవార్త :** పొద్దుతిరుగుడులో ఎరువుల యాజమాన్యం..సూక్ష్మ పోషకాల అవసరం చాలా ఉందని వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త అధిపతి డాక్టర్ ఎస్.శ్రీదేవి అన్నారు. వ్యవసాయ పరిశోధన, ఏరువాక కేంద్రం తోర్నాల ఆధ్వర్యంలో మంగళవారం పొద్దుతిరుగుడు సాగులో మేలైన యాజమాన్య పద్దతులపై శిక్షణా కార్యక్రమంతోపాటు పొద్దుతిరుగుడులో డ్రోన్‌తో బోరాక్స్ పిచికారి పద్దతిపై తొగుట మండల పరిధిలోని తుక్కాపూర్‌లో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొద్దుతిరుగుడులో బోరాక్స్‌ను 400 గ్రాములు ఎకరాకీ పిచికారి చేయడం వల్ల తాలు గింజలు శాతం తగ్గి అధిగ దిగుబడి వస్తుందన్నారు. డ్రోన్లను ఉపయోగించి పిచికారి చేయడం వల్ల కూలీల కొరతను, సమయాన్ని ఆదా చేసుకోవచ్చునని తెలిపారు. 6 నుంచి 7 నిమిషాలలో ఎకరం పొలంలో పిచికారి చేసుకోవచ్చునని తెలిపారు. శాస్త్రవేత్త డాక్టర్ డి.శ్వేత తోర్నాల పంటల వైవిధ్యీకరణలో నూనె గింజల పాత్ర పొద్దుతిరుగుడులో మేలైన యాజమాన్య పద్దతులను రైతులకు వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఉమారాణి, జె.విజయ్, డాక్టర్ పల్లవి, మోహన్, వ్యవసాయ అధికారి రాజేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సీతారామచంద్రస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం


హరీష్‌రావుకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న పాండుగౌడ్, హరివంతులు

**మర్కుక్, మార్చి 4 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పాములపర్తిలో గల శ్రీసపరివార శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు, విమాన గోపుర సుదర్శన, ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను మాజీ మంత్రి హరీష్‌రావుకు తాజా మాజీ ఎంపిపి పాండుగౌడ్, నాచారం మాజీ చైర్మన్ హరివంతులు మంగళవారం హైదరాబాద్‌లోని వారి నివాసంలో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 7వ తేదీ నుండి 10వ తేదీ వరకు జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలకు మాజీ మంత్రి హాజరవుతారని తెలిపారు.

## వైభవంగా శ్రీ రేణుకా ఎల్లమ్మ కళ్యాణం


శ్రీ రేణుకాఎల్లమ్మ కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

**మర్కుక్, మార్చి 4 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పాతూరు గ్రామ శివారులోగల శ్రీరేణుకాఎల్లమ్మ ఆలయంలో అమ్మవారి కళ్యాణం మంగళవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి కళ్యాణాన్ని తిలకించేందుకు మండల పరిధిలోని పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. పూజారి బూకల బాగవ్వ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పెద్ద పట్నంను శివసత్తుల సిగాలు, పోతరాజుల నృత్యాలు చేస్తూ తొక్కగా భక్తులు అమ్మవారిని దర్శనం చేసుకొని తొక్కడం జరిగింది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నప్రసాదం అందజేశారు. ఒగ్గు కళాకారుడు మామిళ్ల యాదగిరియాదవ్ ఆధ్వర్యంలో ఒగ్గు కథ నిర్వహించారు.

### బెజ్జంకిలో ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే

**బెజ్జంకి, మార్చి 4, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో అంబేద్కర్‌నగర్ కాలనీలో అట్టహాసంగా ప్రారంభమైన ఎల్లమ్మతల్లి బోనాల జాతరను మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణ సందర్శించి ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి మొక్కలు చెల్లించుకున్నారు. అంతకు ముందు ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికి శాలువాతో ఎమ్మెల్యేను ఘనంగా సత్కారించారు. మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డు నుంచి ఎస్సీ కాలనీకి అనుసంధానంగా ఉన్నా మట్టి రోడ్డును సీసీ రోడ్డుగా నిర్మించడానికి శంకు స్థాపన చేశారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ పులి కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్,పార్టీ మండల అధ్యక్షులు ముక్కిస రత్నాకర్ రెడ్డి, నాయకులు బైర సంతోష్,శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, అక్కరవేణి పోచయ్య, జేరిపోతుల మధు తదితరులు పాల్గొన్నారు.


ల్లమ్మ తల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే

# డంపింగ్‌యార్డు ఎత్తివేసేవరకు ఉద్యమం ఆగదు

### మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

**నర్సాపూర్, మార్చి 4,ప్రభాతవార్త :** పట్టణానికి ఎక్కువగా నష్టం కలిగించే డంపింగ్‌యార్డును ప్రభుత్వం ఎత్తివేసేవరకు ఉద్యమంఆగదని మాజీ మున్సిపల్ చైర్మన్ దుర్గప్పగారి అశోక్‌గౌడ్ అన్నారు. మంగళవారం నర్సాపూర్ పట్టణంలో డంపింగ్ యార్డ్‌కి వ్యతిరేకంగా నర్సాపూర్ అఖిలపక్షం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలో అశోక్‌గౌడ్ 1వ వార్డ్ ప్రజలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశోక్‌గౌడ్ మాట్లాడుతూ నర్సాపూర్ ఆటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసే డంపింగ్‌యార్డుతో ఎక్కువగా నర్సాపూర్ పట్టణానికి పరిసర గ్రామాలకు ఎక్కువ నష్టం కలిగి వాతావరణం కలుషిత మవుతుందన్నారు. దీంతో ఇక్కడి ప్రాంత ప్రజలు అనారోగ్యాల పాలవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన డంప్‌యార్డ్ ఏర్పాటు వల్ల జరిగే అనర్థాలను వివరించి ప్రతి ఒక్కరూ ప్రజలకు చైతన్యం కలిగేలా కార్యాచరణ తీసుకుని ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు గోడ రాజేందర్, రమేష్‌గౌడ్, హన్మంతు వెంకట రమణరావు, అంజిగౌడ్, కొండి కుమార్, నాగేష్, 1వ వార్డ్ ప్రజలు నల్ల కృష్ణ, వెంకటేష్, సంజీవ్, విజయ్,యాదగిరి,రాజు గౌడ్, శేఖర్, శ్రీకృష్ణ, భాస్కర్, లఖాన్, నర్సింలు, శ్రీనివాస్, పశు భాయ్, ఆంజాద్, పట్టణ యువ నాయకులు రాకేష్ గౌడ్, జాన్, నాగభూషణం, మహ్మద్ అలీ,ఫైజాన్ తదితరులు పాల్గొన్నారు.



రిలే నిరాహారదీక్షలో పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, ప్రజలు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి

## మోటార్లకు మీటర్లు బిగించవద్దు : మాజీ ఎమ్మెల్యే

**పాపన్నపేట, మార్చి 4, ప్రభాతవార్త:** మోటర్ల, ఫీడర్ల కాడ మీటర్లు బిగించవద్దని విద్యుత్ నియంత్రణ మండలి సభ్యులు, మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ నాగార్జున అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాల మూలంగా మృతి చెందిన కుటుంబాలకు అందిస్తున్న 5 లక్షల పరిహారాన్ని15 లక్షల రూపాయలకు పెంచాలని, రైతుల విద్యుత్ నియంత్రికల కోసం అడిగిన నెల రోజుల్లోనే నియంత్రికలను బిగించాలని సూచించారు. మెదక్ జిల్లా కేంద్రంలోనే విద్యుత్ పరికరాల స్టోర్‌ను ఏర్పాటు చేయాలని చైర్మన్ దృష్టికి తీసుకుపోయారు. సమావేశంలో జెన్‌కో, ట్రాన్స్‌కో అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

## వరి పంటలను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి

**కొమురవెల్లి, మార్చి 4, ప్రభాతవార్త :** వరిలో అగ్గి తెగులు, కాండం తొలిచే పురుగు ఉధృతి అధికంగా ఉందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాధిక అన్నారు. మండల పరిధిలోని మరిముచ్చాల గ్రామంలో మంగళవారం మండల వ్యవసాయ అధికారి వెంకట్రావమ్మ, వ్యవసాయ విస్తరణ అధికారి రమ్య వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అగ్గి తెగులు సోకిన వరి ఆకులపై కండే అకారంలో ఎర్రటి మచ్చ ఎర్పడి క్రమంగా ఎండి పోతాయని తెలిపారు. నివారణకు రైతులు నత్రజని(యూరియా), ఎరువుల వాడకాన్ని తాత్కాలికంగా అపివేయాలని సూచించారు. వెంటనే ట్రై సైక్లోజోన్ మందును 0.6గ్రా.లేదా కాసుగా మైసిన్ మందును 1.5.మి.లీ. లేదా ఐసోప్రో తయోలిన్ 1.5 మి.లి. చొప్పున లీటరు నీటికి కలిపి రెండుసార్లు పిచికారి చేసుకోవాలని సూచించారు. తొలిచే పురుగు నివారణకు ముందస్తుగానే చిరు పొట్ట దశలో ఎకరానికి కార్టప్ హైడ్రో క్లోరైడ్ 50 శాతం యస్‌పి 400 గ్రాములు లేదా క్లోరంట్రానిలిప్రోల్ 60 మి.లి. లేదా ఐసో సైక్లోసిరమ్ 120 మి.లి.పిచికారి చేయలన్నారు. ఒకసారి తెల్లకంకులు ఏర్పడిన తర్వాత ఎలాంటి పురుగు మందులు పిచికారీ చేసిన ప్రయోజనం ఉండదని రైతులకు సూచించారు.

## హమాలీ కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

**బెజ్జంకి, మార్చి 4,ప్రభాతవార్త :** హమాలీ కార్మికుల సంక్షేమ కోసం ప్రత్యేకమైన సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సిపిఎం పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు హమాలీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. సంక్షేమ బోర్డు లేకపోవడంతో కార్మికులు ఇబ్బందులుపడుతున్నారని తెలిపారు. పిఎఫ్, ఈఎస్ఐ గుర్తింపు కార్డులుల అందించాలన్నారు.ఇండ్లు లేనినిరుపేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించాలన్నారు. వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయనియెడల పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘ ఎల్లయ్య, బొమ్మిడి సాయి కృష్ణ, కుంట సత్తయ్య, గాజె రాజు, గాజె లక్ష్మణ్, ఇంగె నర్సింగం, తాటిచెట్టు రాజమల్లు, నిషాని నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించి చంద్రశేఖర్‌రెడ్డి

**మనూర్, మార్చి 4, ప్రభాతవార్త:** మండల పరిధిలోని తుమ్నూర్ గ్రామ మాజీ ఉపసర్పంచ్ సన్నాయిల పీరయ్య కుమారుడి వివాహ వేడుకల్లో డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించారు. చంద్రశేఖర్‌రెడ్డితోపాటు మాజీ సర్పంచ్ బ్రహ్మానందరెడ్డి, సంజీవరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శేరి అంజిరెడ్డి, రమేష్,, నర్సప్ప, రామప్ప, రామచంద్రరెడ్డి పాల్గొన్నారు.


జగదేవ్‌పూర్‌లో సామాజిక ప్రజాదర్బార్ నిర్వహిస్తున్న అధికారులు

## జగదేవ్‌పూర్ మండలంలో ప్రజాదర్బార్

**జగదేవ్‌పూర్, మార్చి 4 (ప్రభాతవార్త):** మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2023-24 సంవత్సరంలో చేపట్టిన పనులపై గత వారం రోజులుగా గ్రామాల్లో సామాజిక తనిఖీ చేపట్టారు. మంగళవారం మండల స్థాయిలో సామాజిక తనిఖీపై ప్రజాదర్బార్ ఎంపిడిఓ బి.యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ ప్రజాదర్బార్‌కు అడిషనల్ డిఆర్‌డిఓ బాలకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరంలో 4.20 కోట్ల పనులు జరిగాయని,పనులపై తనిఖీ నిర్వహించగా మండల వ్యాప్తంగా లక్షా 23వేల రూపాయల రికవరీ, రూ.57వేల జరిమానా విధించగా, అదేవిధంగా పిఆర్ నుండి రూ.58వేల రికవరీకి ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిడి, ఎస్ఆర్‌పి, సామాజిక తనిఖీ బృందం, ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## దేవాలయాల అభివృద్ధికి విరాళం

**గుమ్మడిదల, మార్చి4 ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలంలో దేవాలయాల అభివృద్ధికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి విరాళాలు అందజేశారు. ఖాజిపల్లి గ్రామంలోని కాశీ విశాలాక్షి విశ్వనాథ గణపతి నూతన దేవాలయానికి రూ.1,01,116, అలాగే సోలక్‌పల్లి గ్రామంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయానికి రూ.40,000 విరాళంగా అందించారు. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఆధ్యాత్మికతను ప్రోత్సహించేందుకు, దేవాలయాల అభివృద్ధికి ఎల్లప్పుడూ తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. నియోజకవర్గ ప్రజలు భగవంతుడి కృపతో సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆయా దేవాలయాల నిర్వాహకులు గోవర్ధన్ రెడ్డిని శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖాజిపల్లి, సోలక్‌పల్లి గ్రామస్థులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


దేవాలయాల అభివృద్ధికి విరాళం అందించిన చిమ్ముల గోవర్ధన్ రెడ్డి

# ఎమ్మెల్సీగా కొమురయ్య విజయం పట్ల బిజెపి సంబరాలు

**సంగారెడ్డి బ్యూరో, మార్చి 4 ప్రభాతవార్త:** అదిలాబాద్-నిజామాబాద్-మెదక్-కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య ఘనవిజయం సాధించిన సందర్భంగా సోమవారం మెదక్ పట్టణ బీజేపీ అధ్యక్షులు నాయిని ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయోత్సవ సంబరాలలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడ్డం శ్రీనివాస్ మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య గెలుపుకు సహకరించిన ఉపాధ్యాయులకు బీజేపీ పక్షాన ధన్యవాదాలు తెలిపారు. వారి సమస్యల సాధనకు బీజేపీ పోరాటం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్ రెడ్డి, ఓబీసీ జిల్లా అధ్యక్షులు గడ్డం కాశీనాథ్, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు సతీష్ పటేల్, లోకేష్, శివ, కల్కి నాగరాజు, మధు, సంగీత, రాజు, రాహుల్, సన్నీ, నరేందర్, విఠలేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

**పెద్దశంకరంపేటలో...**

**పెద్దశంకరంపేట, మార్చి 4 ప్రభాతవార్త:** కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య మొదటి ప్రాధాన్యత ఓట్లతో గెలవడం పట్ల బీజేపీ మండల అధ్యక్షుడు కోణం విఠల్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం పెద్దశంకరంపేటలోని పార్టీ కార్యాలయం వద్ద నాయకులు బాణాసంచా కాల్చి మిఠాయిలు తినిపించుకున్నారు.ఈ సందర్భంగా కోణం విఠల్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పట్టభద్రుల బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి సైతం


మెదక్‌లో సంబరాలు చేసుకుంటున్న బిజెపి నాయకులు

భారీ మెజార్టీతో గెలుపొందుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ ప్రధాన కార్య దర్శి శ్రావణ్‌కుమార్, నాయకులు బుగుడాల కృష్ణ, సుకుమార్ సురేష్, రాజు పటేల్, నార్సింగ్, కృష్ణ, ఆయాగ్రామాల కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

**నర్సాపూర్‌లో...**

**నర్సాపూర్, మార్చి 4, ప్రభాతవార్త :** బిజెపి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కొమరయ్య విజయంతో మంగళవారం నర్సాపూర్ చౌరస్తాలో బిజెపి నాయకులు సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ మేరకు కరీంనగర్, నిజామాబాద్, అదిలాబాద్, మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి జరిగిన ఎన్నికల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి కొమురయ్య ఘనవిజయం సాధించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కొమరయ్య ఘనవిజయం సాధించినందున నాయకులు సంబరాలను నర్సాపూర్ చౌరస్తాలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు టపాకాయలు పేల్చి బాణా సంచాలు కాల్చి స్వీట్లు పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో ఓబిసి రాష్ట్ర నాయకులు పెద్ద రమేష్‌గౌడ్, బిజెపి ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాపగారి రమేష్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోడ రాజేందర్,అసెంబ్లీ కన్వీనర్ హన్మంతు వెంకటరమణారావు, మండల అధ్యక్షుడు నీలి నాగేష్,నీరుడు చంద్రయ్య, నాయకులు బోర్‌వెల్‌రామ్‌రెడ్డి, బాదే బాలరాజ్, సంఘసాని రాజు, రాములు నాయక్, ఓంకార్ పాల్గొన్నారు.


పెద్దశంకరంపేటలో మిఠాయిలు తినిపించుకుంటున్న బిజెపి నాయకులు


నర్సాపూర్ చౌరస్తాలో సంబరాలను జరుపుకుంటున్న బిజెపి నాయకులు


రామాయంపేటలో సైన్స్‌ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓ శ్రీనివాస్

## రామాయంపేట మోడల్ స్కూల్‌లో సైన్స్‌ఫెయిర్

### 400 ఎగ్జిబిట్స్ ప్రదర్శించిన విద్యార్థులు

**రామాయంపేట మున్సిపాలిటీ, మార్చి 4, ప్రభాతవార్త :** రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో మంగళవారం నాడు సైన్స్‌ఫెయిర్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామాయంపేట ఎంఈఓ అయిత శ్రీనివాస్ హాజరై సైన్స్‌ఫెయిర్‌ను ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన సుమారు 400 ఎగ్జిబిట్స్‌ను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయడంలో ఇటువంటి వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఎప్పటికప్పుడు కొత్తగా ఆలోచించేలా ప్రోత్సహించాలని సూచించారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ పీఎంశ్రీ కార్యక్రమంలో భాగంగా ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమం కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం


గొల్లపల్లిలో స్వయంపాలన దినోత్సవాన్ని జరుపుకున్న విద్యార్థులు

**జగదేవ్‌పూర్, మార్చి 4 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని గొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. డీఈఓగా వేణు, ప్రధానోపాధ్యాయునిగా సిహెచ్.ప్రదీన్, ఎంఈఓగా పవన్, ఉపాధ్యాయులుగా వైష్ణవి, భావన, భార్గవి, మహేశ్వరి, వంశీ, రిషి, జశ్వంత్, అటెండర్‌గా విష్ణువర్ధన్, పీఈటీగా కృష్ణలు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందర్, సీనియర్ ఉపాధ్యాయులు సిహెచ్.వెంకట్రాంరెడ్డి, ఉపాధ్యాయ బృందం వాణి, మేనక, విజయలక్ష్మి, శ్రీనివాస్, విమల, ఎం.రజిత, విద్యార్థులు పాల్గొన్నారు.

## రంగంపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 'ప్రేరణ'

**కొల్చారం, మార్చి 4 ప్రభాతవార్త:** భగవాన్ శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం డైట్ రిటైర్డ్ ప్రిన్సిపల్ రమేష్‌బాబు ప్రధాన వక్తగా విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింరది. రమేష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు హార్డ్‌వర్క్ కాదు.. స్మార్ట్‌వర్క్ చేయాలని, తల్లి దండ్రులను, పెద్దలను గౌరవించాలని, పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా బాగా రాయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ర్యావ, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీధర్ రెడ్డి, సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షులు శిరిగ ప్రభాకర్, సత్యసాయి సేవా సమితి మహిళా ఇన్‌ఛార్జి లక్ష్మీప్రసన్న, జిల్లా సేవాదళ్ ఇన్‌ఛార్జి కామిని రుక్మిణి, ఆధ్యాత్మిక ఇన్‌ఛార్జి గంధె నాగరాణి, సమితి విద్యా విభాగ్ ఇన్‌ఛార్జి శైలజ, నారాయణ సేవా ఇన్‌ఛార్జి ముక్కా నగేష్ గుప్తా, ఉపాధ్యాయులు ఉన్నారు.

## యాజమాన్య పద్ధతులపై అవగాహన ఉండాలి

**నర్సాపూర్, మార్చి 4, ప్రభాతవార్త :** వేసవిలో కూరగాయల పంటల యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కలిగి ఉండాలని మోజల్‌రా హార్టికల్చర్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ షహనాజ్ సూచించారు. మంగళవారం నర్సాపూర్ పట్టణంలోని రైతు వేదికలో జరిగిన రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ షహనాజ్ వేసవికాలంలో కూరగాయల పంటలు ఎలా వేసుకోవాలోవాటి యాజమాన్య పద్ధతులను క్లుప్తంగా రైతులకు వివరించారు. అనంతరం ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి శ్రీనివాస్ రెడ్డి పశు సంపద, పశు జాతి అభివృద్ధిపై రైతులకు క్లుప్తంగా వివరించి అవగాహన కల్పించారు. పశు సంపదను రైతులు అభివృద్ధి చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రైతుల సందేహాలను అడిగి తెలుసుకుని వారికి అర్థమయ్యే రీతిలో వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి విన్సెంట్ వినయ్ కుమార్, సహాయ వ్యవసాయ సంచాలకులు విజయనిర్మల, మండల వ్యవసాయ అధికారి దీపిక, ఏ ఈ ఓ లు చంద్రవేణి రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబీకులను పరామర్శించిన ఎమ్మెల్యే

**కొమురవెల్లి, మార్చి 4, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఐనాపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కురుమ సంఘం జిల్లా నాయకుడు అత్తూరి జయరాములు సతీమణి కనకలక్ష్మీ(45) మాజీ ఎంపిటిసి మరణించడంతో ఈ విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంగళవారం బాధిత కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం కనకలక్ష్మీ మృతదేహంపై పుష్పగుచ్చం వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబీకులకు ధైర్యం చెప్పి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం అంత్యక్రియాలలో పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ

**నారాయణఖేడ్, మార్చి 4, ప్రభాతవార్త:** విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు విద్యాసామాగ్రిలను అందచేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి సతీమణి పట్లోళ్ల అనుపమరెడ్డి అన్నారు. మంగళవారం నారాయణఖేడ్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ డిక్షనరీలే. అట్లాస్ బుక్స్‌లను అందచేశారు. ఈ సందర్భంగా అనుపమరెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యార్థులకు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మన్మధ కిషోర్, యాదవరెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెంకటరావు, సభ్యులు చంద్రశేఖర్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన దారం శంకర్

**నారాయణఖేడ్, మార్చి 4, ప్రభాతవార్త:** మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా దారం శంకర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సంజీవరెడ్డి సహకారంతో మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డులలో సిసి రోడ్లు, మురుగుకాల్వల నిర్మాణ పనులు జోరుగా కొనసాగుతున్నాయన్నారు. పట్టణంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు నాణ్యతతో నిర్మించేలా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ కాంట్రాక్టర్‌లకు పలుసూచనలు చేస్తున్నామన్నారు. బైపాస్ రోడ్డుకు మరమ్మత్తులు చేయించి ప్రయాణీకులు ప్రశాంతంగా ప్రయాణం చేసేలా ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజ్‌భూషణ్, డాక్టర్ వెంకటేశం, కృష్ణమాచారి ఉన్నారు.


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ శంకర్

# సమిష్టిగా పోరాడి డంపింగ్ యార్డును నిలిపివేద్దాం

## 27వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్ష

**గుమ్మడిదల, మార్చి 4 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రిలే నిరాహార దీక్షలో బేడ బుడగ జంగం సంఘం సభ్యులు 27వ రోజున దీక్షలో పాల్గొన్నారు. బేడ బుడగ జంగం సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ పచ్చని అడవి తల్లిని పాడు చేసే విధంగా అధికారులు, నాయకులు జీహెచ్ఎంసీ పరిధిలోని చెత్తను రీసైకిల్ చేయడానికి మిగులు భూమి 152 ఎకరాలను అప్పనంగా ఓ ప్రైవేట్ సంస్థకు అప్పజెప్పి చేతులు దులుపుకున్న గత ప్రభుత్వం, ఇప్పటికైనా స్వార్థపూరిత రాజకీయాలకు తావు ఇవ్వకుండా పెద్ద మనసు చేసుకొని ప్రస్తుత ప్రభుత్వం తక్షణమే అనుమతులను రద్దు చేసే విధంగా చర్యలు తీసుకునే విధంగా స్థానిక నాయకులు చర్యలు తీసుకోవాలని కోరారు. కొందరి రాజకీయ స్వార్థాలకు పచ్చని పల్లెటూర్లు, పచ్చని వాతావరణం, పశు సంపద, వృక్ష సంపద, అటవి జంతు సంపద, పక్షుల సంపదను కోల్పోకుండా మానవ మనుగడ ప్రశ్నార్థకం కాకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రరాజధానికి కూతవేటు దూరంలో ఉన్న ఏకైక వృక్ష సంపద, అటవీ సంపద, నల్లవల్లి అడవి మాత్రమేనని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షులు జైపాల్‌రెడ్డి, పుట్ట నర్సింగ రావు, కుమార్‌గౌడ్, మూడు చింతల నరేందర్‌రెడ్డి, తులసిదాస్, సద్ది విజయ భాస్కర్‌రెడ్డి, ఆకుల ఆంజనేయులు, సంజీవరెడ్డి, పడమటి మహిపాల్ రెడ్డి, మంద భాస్కర్ రెడ్డి, భిక్షపతి రెడ్డి, కావలి శంకర్, బేడ బుడగ జంగం సభ్యులు శంకరయ్య, లింగమయ్య, సత్యనారాయణ, శ్రీశైలం, మహంకాళి, రాము, ఈశ్వరమ్మ, జ్యోతి, అరుణ, అమృత, శకుంతల తదితరులు పాల్గొన్నారు. నల్లవల్లిలో జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరహార దీక్షలు 27వ రోజుకు చేరుకున్నాయి. ఈ కార్యక్రమంలో కుమ్మరి కృష్ణ, లక్ష్మణ్,రాములు, రమేష్, రాజయ్య, శ్రీపాల్, ఆంజనేయులు, శ్రీకాంత్, శ్రీను, లక్ష్మీ, యాదమ్మ, వీరమని, పోచమ్మ తదితరులు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న బేడ బుడగ జంగం సంఘం సభ్యులు



టేక్మాల్‌లో సంబురాలు జరుకుంటున్న బిజెపి నాయకులు

## టేక్మాల్‌లో బిజెపి సంబురాలు

**టేక్మాల్, మార్చి, 4 (ప్రభాతవార్త):** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీ అభ్యర్థి మల్క కోమరయ్య విజయం పట్ల ఆ పార్టీ నాయకులు టేక్మాల్‌లో విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా టపాసులు పేల్చి స్వీట్లు పంచి పెట్టారు. అనంతరం నాయకులు ప్రసంగిస్తూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మల్క కోమరయ్యను గెలిపించినందుకు ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నాయికోటి శామయ్య, ఎల్లుపెట రాజు, ప్రధాన కార్యదర్శి కుమ్మరి సిద్దిరాములు, ఉపాధ్యాక్షులు వడ్డె రాములు,ఆంబయ్య, కోశాధికారి దుర్గాప్రసాద్, జిల్లా గిరిజన మోర్చా ఉపాధ్యాక్షులు మోహన్, గిరిజన మోర్చా అధ్యక్షులు సేనాపతి, ప్రభారిలు శంకర్, బాలరాజ్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, వినోద్‌కుమార్, సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

## మాతృభాషను మరవొద్దు : ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి



పుస్తకావిష్కరణలో మాట్లాడుతున్న ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి

**నారాయణఖేడ్, మార్చి 4, (ప్రభాతవార్త):** మాతృభాషను మరవకూడదని ఉస్మానియా యూనివర్సిటీ పూర్వ ఆచార్యులు డాక్టర్ కసిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చాప్ట(కె) ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు నరసింహులు అధ్యక్షతన అష్టావధానం, పద్య కవి, పాఠశాల తెలుగు అధ్యాపకుడు భూమయ్య రచించిన శ్రీరామరావు భాషాభిమాని, కవులను ప్రోత్సాహిస్తున్న కంది శంకరయ్య రసగీత సాహితీసంస్థ వ్యవస్థాపకులు మైపాల్‌రెడ్డి, అవధాని భానుప్రకాష్ వందలాది మంది విద్యార్థుల కరతాళధ్వనుల మధ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో సాహిత్య సమావేశం నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. అవధాన సంచాలకులు కంది శంకరయ్య మాట్లాడుతూ అవధానంపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో విశ్రాంత విద్యుత్ శాఖ ఇంజనీర్ రాఘవులు, వడ్ల రాజయ్య, ఈశ్వరయ్య, మారుతి, పద్మాకర్, మారుతి నర్వ,పండరి, రేణుక, శోభ, ఉపాధ్యాయులు నరసింహారెడ్డి, కృష్ణ శ్రీనివాస్, రాజారాం, శ్రీనివాస్‌రెడ్డి, గంగారం, గంగామణి, ఖుర్షీద్, ప్రహ్లాద్, తెలుగు ఉపాధ్యాయులు నీరజ, గౌరమ్మ, నాగభూషణం, మహేందర్, సాయిబాబా, గ్రామస్థులు సాహిత తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ తల్లి ఆలయంలో ఘనంగా విగ్రహప్రతిష్టాపన

**-పూజలు చేసిన ఆదర్శ్‌రెడ్డి**

**రామచంద్రాపురం, మార్చి 4, (ప్రభాతవార్త):** భారతీ నగర్ డివిజన్ పరిధిలోని బొంబాయి కాలనీలో సర్కిల్ యూత్ నరసింహ ఆధ్వర్యంలో శ్రీ ఎల్లమ్మ అమ్మవారి దేవాలయంలో మంగళవారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్టాపన పూజా కార్యక్రమంలో, కిష్టారెడ్డిపేట్ గ్రామంలోని శ్రీ దుర్గమ్మ జాతర మహోత్సవంలో బిఆర్ఎస్ రాష్ట్ర నేత వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వెన్నవరం ఆదర్శ్‌రెడ్డితో పాటు మాజీ కార్పోరేటర్ తొంట అంజయ్య యాదవ్, కిష్టారెడ్డిపేట మాజీ సర్పంచ్ కృష్ణ, బిఆర్ఎస్వీ జిల్లా కో-ఆర్డినేటర్ కృష్ణకాంత్, బిఆర్ఎస్ యూత్ నాయకులు మాణిక్‌యాదవ్,నాయకులు మాణిక్‌యాదవ్, శివ, రాకేష్, మహేష్, దేవేంద్రచారి, పాటి సత్యనారాయణ, పాపయ్య పాల్గొన్నారు.

## హార్టికల్చర్ సాగుపై రైతులు దృష్టిని సారించాలి

**-జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ శ్రవణ్‌కుమార్**

**అల్లాదుర్గం, మార్చి 4, (ప్రభాతవార్త):** రైతులు హార్టికల్చర్ పంటల సాగుపై ప్రత్యేక దృష్టిని సారించాల్సిన అవసరం ఉందని జిల్లా హార్టికల్చర్ మేనేజర్ శ్రవణ్‌కుమార్ సూచించారు. మంగళవారం అల్లాదుర్గంతో పాటు కాయిదాంపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో ఏర్పాటు చేసిన నర్సరీలను, హార్టికల్చర్ సాగుచేస్తున్న తోటలను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో రైతుల ఆదాయ వనరులను పెంపొందించేందుకు ఉపాధి హామి నిధుల ద్వార జామ, మామిడి, నిమ్మ, కొబ్బరి, మునగ తదితర పండ్ల తోటల పెంపకం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల రైతులు మండలంలోని ఉపాధి హామీకార్యాలయంలో అధికారులను సంప్రదించి ధరఖాస్తులు చేసుకోవాలని సూచించార. కార్యక్రమంలో ఎంపిడిఓ చంద్రశేఖర్, ఏపిఓ సుధాకర్, టెక్నికల్ అసిస్టెంట్ సాయికుమార్, పంచాయితీ కార్యదర్శులు నవీన్, ప్రభాకర్, రైతులు పాల్గొన్నారు.

## ఎఐటియుసి డైరీ ఆవిష్కరణ

**నారాయణఖేడ్, మార్చి 4, (ప్రభాతవార్త):** మినీ అంగన్‌వాడి సమస్యలను పరిష్కరించకుండా అరెస్టులు చేయడంపైనే కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టిని సారించడం తగదని ఏఐటీయూసి జిల్లా నాయకులు చిరంజజీవి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఏఐటీయూసి డైరిని అంగన్‌వాడి టీచర్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు పెండింగ్‌లో ఉన్న 9 నెలల వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో నిర్వహించే నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళుతున్న అంగన్‌వాడి టీచర్లను ఇండ్లకాడికి పోయి తలుపులు తట్టి ఆరెస్టు చేసి పోలీసు ఠాణాలకు తరలించడం తగునా అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ పాలనలో ఇలాంటి అరెస్టుల మూలంగానే రాష్ట్ర ప్రజలు కారుకు గాలి తీసేసి షెడ్డుకు పరిమితం చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాలు వినకుమారి, విద్యావతి, శశికళ తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్‌ఫాంపై రైతులకు అవాహన

**మనూర్, మార్చి 4, (ప్రభాతవార్త):** మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్ ఫాం పంటపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో 3 వేల ఎకరాల్లో ఆయిల్‌ఫాం పంటను సాగుచేసేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకం అందించనుందని, అందుకు గోద్రెజ్ ఆగ్రో వెట్ సంస్థను నియమించిందని ఉద్యానవన శాఖ అధికారులు పేర్కొన్నారు. ఎకరానికి 57 మొక్కల చొప్పున 90 శాతం రాయితీపై అందిస్తామన్నారు. మొదటి 4 సంవత్సరాలు పంట నిర్వాహణకు ఎకరానికి 4200 రూపాయలను ప్రతి సంవత్సరం అందిస్తామని, డ్రిప్ ఇరిగేషన్ రాయితీపై ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అన్ని రకాల నేలలలో ఆయిల్ ఫాం సాగవుతుందని పేర్కొన్నారు. ఒక్కో చెట్టుకు ఆడ, మగ పూల గుత్తులు వేరువేరుగా వస్తాయని, మొక్క నాటిన 36 నెలల తర్వాత మొదటి కోత ప్రారంభం అవుతుందని, 25 నుంచి 30 సంవత్సరాలు పంట దిగుబడిని అందుకోవచ్చన్నారు. ఒక్కో చెట్టుకు సంవత్సరానికి సరాసరిగా 5 నుంచి 12 గెలలు ఉత్పత్తి అవుతాయని, గెల బరువు 25 కిలోలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి మౌనికరెడ్డి, గోద్రెజ్ ఆగ్రోవేట్ ప్రతినిధులు ఏఈఓ సంగమేశ్వర్, వెంకటేశం, రైతులు పాల్గొన్నారు.

## తండాల్లో కమ్యూనిటీ కార్యక్రమాలు

**కంది, మార్చి 4, (ప్రభాతవార్త):**

హైదరాబాద్‌లోని సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాల ఫర్ ఉమెన్, ఉన్నత భరత అభియాన్ ఇనిషియేటివ్ ద్వార మండల పరిధిలోని కంది తండా, వడ్డెనగుడి తండా, ఎర్దానూర్ తండా,ఇప్పలగడ్డా తండాలో కమ్యూనిటీ కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. 35 మంది విద్యార్థులు,8 మంది అద్యాపకుల బృంధం కార్యక్రమంలో పాల్గొని అభ్యాసం, సమాజ అభివృదిదకి అర్థవంతమైన కృషి చేయాలని సూచించారు.



ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంతో తెలంగాణ ఉద్యమకారుడు కుమ్మరి వెంకటేష్

## తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోండి

**-ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను కలిసిన కుమ్మరి వెంకటేష్**

**గుమ్మడిదల, మార్చి 4 (ప్రభాతవార్త):** గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు కుమ్మరి వెంకటేష్ హైదరాబాదులోని తెలంగాణ జన సమితి పార్టీ ఆఫీసులో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో జరగబోయే శాసన మండలి సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తమ విన్నపాలను తీసుకెళ్లి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, ఇంటి నిర్మాణం, అలాగే 25 వేల పెన్షన్, ఆరోగ్య భీమా, ఉద్యమకారుల పిల్లలకు ఉచిత విద్య అందించే విధంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని ఉద్యమకారుడు కుమ్మరి వెంకటేష్ తెలిపారు.

## మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన నరోత్తం

**న్యాల్‌కల్, మార్చి 4, (ప్రభాతవార్త):** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ సమీపంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి తండ్రి మాజీ సర్పంచ్ భూమారెడ్డిని ఎస్సీ కార్పోరేషన్ మాజీ చైర్మన్ వై నరోత్తం పరామర్శించారు. మంగళవారం మల్గి గ్రామానికి చెరుకుని భూమారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నరోత్తం వెంట మల్లయ్యస్వామి, గార్లపల్లి శివరాజ్ ఉన్నారు.

## 27వ రోజుకు చేరిన కొత్తపల్లిలో రిలే నిరాహార దీక్ష

**గుమ్మడిదల, మార్చి 4 (ప్రభాతవార్త):** గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్యారా నగర్‌లో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా రిలే నిరాహార దీక్షలు 27వ రోజుకు చేరాయి. జేఏసీ, కొత్తపల్లి మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దీక్షలో గ్రామంలోని ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని సంఘీభావం తెలపడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ జీహెచ్ఎంసీ పరిధిలోని చెత్తను తీసుకువచ్చి ప్యారానగర్ ప్రాంతంలో డంపు చేయడం వన్యప్రాణులకు, వృక్షాలకు, గొలుసుకట్టుగా ఉన్న చెరువులకు ప్రమాదం అని, భావితరాలను దృష్టిలో ఉంచుకొని స్వచ్ఛందంగా స్వచ్ఛమైన నీరు, స్వచ్ఛమైన గాలి, మానవ మనుగడ ప్రశ్నార్థకం కాకుండా ఉండడం కోసం ప్రతి ఒక్కరూ గ్రామాలలో పార్టీలకు, వర్గాలకు అతీతంగా స్వచ్ఛందంగా పాల్గొనడం చాలా సంతోషకరమని, ప్రభుత్వం వెంటనే డంపింగ్ యార్డ్‌ను వెనక్కు తీసుకొని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగని చోట ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ విజయ్ కుమార్, సూరారం మహేష్, గాది వెంకటేష్, నర్సింలు, నీరుడు కృష్ణ, కొక్కొండ రవి, హనుమంత రెడ్డి, ఆగం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.




కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష



స్వయం పరిపాలన దినోత్సవంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

**పెద్దశంకరంపేట, మార్చి 4 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని వీరోజిపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులై విద్యార్థులకు విద్యా బోధన చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారిగా అభిలాష్, ప్రధానోపాధ్యాయులుగా పవన్‌చారి, ఉపాధ్యాయులుగా సంగీత, గౌతమి, గంగోత్రి, దీక్ష,మహాలక్ష్మీ, మేఘమాల, వైష్ణవి, అంజలి, ఆనందిత, పల్లవి, శ్రీజ, సౌందర్య, మహేందర్, సంగమేశ్వర, చరణ్ బాబులు వ్యవహరించారు. కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు లక్ష్మణమూర్తి. ఉపాధ్యాయులు జ్ఞానేశ్వర్, పాండురంగ, శ్యామల, కిషోర్, అనుష్క పర్యవేక్షించారు.

**బొంతపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో...**



స్వయం పరిపాలన దినోత్సవం దృశ్యం

**గుమ్మడిదల, మార్చి 4 (ప్రభాతవార్త):** బొంతపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పదవ తరగతి విద్యార్థులచే స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పదవ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా, వివిధ విద్యా శాఖ పదవులను చేయడం జరిగింది. హెచ్ఎంగా రాగిణి, కాంప్లెక్స్ హెచ్ఎంగా విశాలి, మండల విద్యాశాఖ అధికారిగా శ్రీజ, ఉప విద్యాశాఖ అధికారిగా హారిక, పరిషత్ విద్యాశాఖ అధికారిగా భద్ర, నోడల్ ఆఫీసర్‌గా శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్‌గా శ్రీధర్, జిల్లా విద్యాశాఖ అధికారిగా అమ్ములు, జాయింట్ డైరెక్టర్‌గా సంకీర్తన, రీజనల్ జాయింట్ డైరెక్టర్‌గా దేవకి, కమిషనర్, డైరెక్టర్ స్కూల్ ఎడ్యుకేషన్‌గా రాజేశ్వరి, విద్యా శాఖ మంత్రిగా నవ్య, వివిధ సబ్జెక్టులకు సంబంధించి విద్యార్థులు ఉపాధ్యాయ లుగా వ్యవహరించినారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కరరావు, సంపత్‌కుమార్, ప్రసాద్, విశ్వనాథ్, ఏసుపాదం, శ్రీనివాసు, ఊర్మిళాదేవి, విజయ్‌కుమార్, విజయరాణి సత్యశ్రీ, శ్రీదేవి, పోతన జ్యోతి, రాధ, పద్మ, జ్యోతిలు పాల్గొన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయడం జరిగింది.

## అంగన్‌వాడీ టీచర్ల అరెస్టు

**నాగల్‌గిద్ద, మార్చి 4,(ప్రభాతవార్త):** అంగన్‌వాడి టీచర్ల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ధర్నాలో పాల్గొనేందుకు హైదరాబాద్ వెళుతున్న అంగన్‌వాడి టీచర్లను పోలసులు అరెస్టు చేసి పోలీసు ఠాణాకు తరలించారు. అంగన్‌వాడి టీచర్ల సొంత పూచీకత్తుపై సాయంత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ సాయిలు, పోలీసు సిబ్బంది వీరప్ప, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



అంగన్‌వాడి టీచర్లను అరెస్టు చేసిన పోలీసులు




కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో మాట్లాడుతున్న సిఐ రేణుకరెడ్డి

## ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరాలి : సిఐ

**అల్లాదుర్గం, మార్చి 4, (ప్రభాతవార్త):** ప్రతి విద్యార్థి కష్టపడుతూ ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సిఐ రేణుకరెడ్డి అన్నారు. మంగళవారం అల్లాదుర్గం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో అల్లాదుర్గం, ముస్తాపూర్ జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలల విద్యార్థినులకు మహిళ సాధికారణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సిఐ రేణుకరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసరం ఉందని, అందుకు విద్య ఎంతో అవసరమని గుర్తు చేశారు. ఆత్మస్థైర్యంతో విద్యార్థినులు ముందుకు సాగాలన్నారు. ప్రమాదం పొంచి ఉందనుకుంటే 1098కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ ధనుజయ, ముస్తాపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, సిడిపిఓ ధ్మలత, జెసిడిఓ జగదీశ్వరి, వైద్యాధికారి సంధ్యారాణి, న్యాయవాదులు ఇశ్వర్య, సంతోషి, కేజీబీవీ ఎస్ఓ స్రవంతి, ఉపాధ్యాయులు జనార్ధన్, అరుణ, రుక్మిణి, కేజీబీవీ ఉపాధ్యాయిులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## కాయిదంపల్లిలో ఉపాధ్యాయులైన విద్యార్థులు



కాయిదంపల్లిఓ స్వయంపాలన జరుపుకుంటున్న విద్యార్థులు

**అల్లాదుర్గం, మార్చి 4, (ప్రభాతవార్త):** మండల పరిధిలోని కాయిదంపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఆనందోత్సవాలతోఘనంగా జరుపుకున్నారు. ప్రధానోపాధ్యాయులుగా శశాంక్, ఉపాధ్యాయులుగా శ్రావ్య, పార్వతి, దుర్గ భవాని, హనుమంతు, ప్రభాస్, విష్ణువర్ధన్, పెద్దిరాజు, వీరేశలింగం, లక్ష్మీపతి, విశాల్ బాధ్యతలు స్వీకరించి తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు డి రంజ నాయక్, ఉపాధ్యాయులు డి.నామ్య, కె.కవితలు అభినందించారు.

**శ్రీశివసాయి విద్యాలయంలో...**



స్వపరిపాలన జరుపుకుంటున్న విద్యార్థులు

**మనూర్, మార్చి 4, (ప్రభాతవార్త):** మండల పరిధిలోని బెల్లాపూర్ గ్రామంగల శ్రీశివసాయి విద్యాలయంలో మంగళవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ప్రధానోపాధ్యాయులుగా ఎల్ వివేక్‌రెడ్డి, మండల విద్యాధికారిగా జి జస్వంత్, జిల్లా విద్యాధికారిగా ఎండి సాబీర్‌లు విధులు నిర్వహించారు. ఉపాధ్యాయులుగా ప్రతిభ చాటిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించి బహుమతులు అందచేశారు.

**కరస్‌గుత్తి జడ్పీహెచ్ఎస్‌లో...**



కరస్‌గుత్తిలో స్వయంపరిపాలన జరుపుకుంటున్న విద్యార్థులు

**నాగల్‌గిద్ద, మార్చి 4, (ప్రభాతవార్త):** విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాల్సిన అవసరం ఉందని మండల పరిధిలోని కరస్ గుత్తి జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు హిరిమణ్ సూచించారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. కలెక్టర్‌గా ఎం.సంగీత, జిల్లా విద్యాధికారిగా ఏ.గణేష్, మండల విద్యాధికారిగా శివకుమార్, ప్రధానోపాధ్యాయురాలి శ్రీమాన్, ఉపాధ్యాయులుగా సుశాంత్, వర్ష, దీపికలు విధులు నిర్వహించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రతిభ చాటిన ఉపాధ్యాయులైన విద్యార్థులను అభినందించి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

**కోనాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో...**



**రామాయంపేట మున్సిపాలిటీ, మార్చి 4, (ప్రభాతవార్త) :** రామాయంపేట మండలం కోనాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం జరిగిన ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలిగా కుమారి జి.కీర్తన, ఎంఈఓగా కె.పూజ వ్యవహరించారు. ఇతర ఉపాధ్యాయులుగా మనోహర్, అర్చన, రేఖ, కళ్యాణ్, అక్షయ, జానకి, మంజుల, అఖిలేష్, అజయ్, విష్ణు, నవీన్, విజయ్, రాకేష్, సమీర్, సందీప్‌లు వ్యవహరించి పలు తరగతులకు పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయుడు అయిత శ్రీనివాస్ పర్యవేక్షించగా, ఉపాధ్యాయులు శివరాజయ్య, దాసు, మహేందర్, వెంకటస్వామి, భాగ్యలక్ష్మి, రమేష్ పాల్గొన్నారు.

## పాపన్నపేటలో ఘనంగా బోనాల ఊరేగింపు

**పాపన్నపేట, మార్చి 4, (ప్రభాతవార్త):**

మండల కేంద్రంలో మంగలవారం గౌడ కులస్థులు రేణుకా ఎల్లమ్మ తల్లికి ఘనంగా బోనాల కార్యక్రమం నిర్వహించారు. ఉదయం ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ఒడి బియ్యం నింపి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. సాయంత్రం దప్పు చప్పుళ్ల మధ్య మహిళలు తలపై బోనాలను పెట్టుకుని ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో సత్యగౌడ్,మహేందర్‌గౌడ్, కషన్‌గౌడ్, రామచందర్‌గౌడ్, వెంకట్‌గౌడ్, గౌడ సంఘం సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జెసి ఐక్యతను దెబ్బతీసేందుకే హైడ్రాకు ఫిర్యాదు

**-ప్లాట్‌ల యజమానుల నిర్ణయం మేరకు డబ్బులు సమకూర్చాం.. డబ్బును ఎలాంటి దుర్వినియోగం చేయలేదు**

**-అవసరాల నిమిత్తం ఉపయోగించాం.. హైడ్రా అధికారులకు వెల్లడించిన పెద్ద చెరువు ముంపు బాధితుల జేఏసీ సభ్యులు**

**అమీన్‌పూర్, మార్చి 4 (ప్రభాతవార్త):**

అమీన్‌పూర్ పెద్ద చెరువు బాధితుల జేఏసీ ఐక్యతను దెబ్బతీసేందుకు కొందరు జేఏసీపేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కి ఫిర్యాదు చేయడం చాలా బాధాకరమని అమీన్‌పూర్ పెద్ద చెరువు బాధితుల జేఏసీ సభ్యులు తెలిపారు. జేఏసీ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారని కొందరు వ్యక్తులు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేయడంతో సోమవారం పెద్దచెరువు జేఏసీ సభ్యులు హైడ్రా కమిషనర్ ఆఫీసులో అధికారులకు దానిపై వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా పెద్ద చెరువు జేఏసీ సభ్యులు ఓ ప్రకటన విడుదలచేశారు. ప్లాట్‌ల యజమానుల నిర్ణయం మేరకు డబ్బులు సమకూర్చామని, డబ్బులను ఎలాంటి దుర్వినియోగం చేయకుండా అవసరాల నిమిత్తం ఉపయోగించామని హైడ్రా అధికారులకు తెలియజేశామని అమీన్ పూర్ పెద్ద చెరువు ముంపు బాధితుల జేఏసీ సభ్యులు తెలిపారు. అమీన్‌పూర్ పెద్ద చెరువులో 20 లే అవుట్‌లు, ఐదువేల ప్లాట్‌లు నీటిలో మునిపోయాయని, కావున ప్లాట్‌ల బాధితులం అందరం కలిసి ఏకతాటిపై సమిష్టి నిర్ణయంతో అమీన్‌పూర్ పెద్ద చెరువు బాధితుల సంఘం ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పుకొచ్చారు. సమస్య పరిష్కారం కోసం సీఎం ప్రజావాణిలో, కలెక్టర్ కార్యాలయం, ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, ప్రభుత్వ కార్యాలయాల్లో అనేకమార్లు సమస్యను పరిష్కరించారని కోరుతూ ఫిర్యాదు చేయడం జరిగిందని, కానీ నేటి వరకు ఇలాంటి సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. జేఏసీ సభ్యులు అందరూ కలిసి జనరల్ బాడీ మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని, జనరల్ బాడీ మీటింగ్‌లో నిత్యవసర ఖర్చులు, కోర్టు ఖర్చుల నిమిత్తము ప్రతి ప్లాట్ యజమాని 5000 రూపాయలు చొప్పున ఇవ్వాలని నిర్ణయించుకొని అందరూ మెయింటెనెన్స్ బుక్కులో సంతకాలు చేశారని హైడ్రా ఆఫీసులో తెలిపారు. ప్లాట్ యజమానులు ఇచ్చిన డబ్బులు జేఏసీ వ్యవస్థ కార్యకలాపాలకు, నిత్యవసరాలకు, వివిధ ప్రభుత్వ కార్యాలయాలను నుండి కావాల్సిన వివరాలు సేకరించడానికి, కొందరికి లీగల్ నోటీస్ పంపించడానికి జేఏసీ సమకూర్చిన డబ్బులు వినియోగించామని హైడ్రా అధికారులకు చెప్పుకొచ్చారు. వచ్చిన డబ్బుతో ఏ విధమైన దందా, వ్యాపారం నిర్వహించుకోవడంలేదని, కేవలం పెద్ద చెరువు జేఏసీ అవసరాల కోసమే డబ్బును ఉపయోగిస్తున్నామని, హైడ్రా అధికారుల దగ్గర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చిరునామా సత్యనారాయణ, పుండరీ శర్మ, టీవీ రావు, సంజయ్ కుమార్, రతన్ లాల్, మల్లారెడ్డి, ఏవి రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పెద్ద చెరువు ముంపు బాధితుల జెసి సభ్యులు